ప్రజాశక్తి

గురువారం 24 నవంబర్ 2022 8 పేజీలు





ఎన్‌టిఆర్ కృష్ణా



సభలో మాట్లాడుతున్న కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజు

ఏళ్లు గడిచినా దళితుల అభ్యున్నతి శూన్యం

కెవిపిఎస్, వ్యకాస నేతలు జి.నటరాజు, కోట కళ్యాణ్

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు : ప్రభుత్వాలు మారుతున్నా దళితుల అభివృద్ధిమాత్రం జరగడంలేదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి జి.నటరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. కెవిపిఎస్ ఎన్‌టిఆర్ జిల్లా 6వ మహాసభ సందర్భంగా బుధవారం ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో కెవిపిఎస్ నాయకులు, డప్పు కళాకారులు పాల్గొని పాత సినిమా హాల్ సెంటర్ వద్ద నుండి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వరకు వచ్చారు. మార్గమధ్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రావు, జ్యోతిరావు పూలే విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సత్రంలో జరిగిన సభలో నటరాజు, కళ్యాణ్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు పూర్తయినా, ఎన్ని ప్రభుత్వాలు మారినా దళితుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడంలేదన్నారు. దళితుల సమస్య పరిష్కారం కోసం కెవిపిఎస్ ఉద్యమిస్తోందన్నారు. 1998లో ఆవిర్భవించిన కెవిపిఎస్ నాటి నుండి దళితుల ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన లక్ష్యసాధనగా అనేక పోరాటాలు చేసిందని

(మిగతా 6లో)

రొయ్య రైతు విలవిల !

- కొనుగోలులో దళారులదే హవా
- ప్రభుత్వం నిర్ణయించిన ధరలు అమలుకాని వైనం
- నేరుగా రైతుల నుంచికొనుగోలుకు కంపెనీల నిరాకరణ
- కిలోకు రూ. 30 నుంచి రూ. 40 వరకు ధర తగ్గింపు



ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

కోడూరు మండలం నర్సింహపురం గ్రామానికి చెందిన కొల్లి చినబాబుకు చెందిన ఏడెకరాల్లో రెండు రోజుల క్రితం రొయ్యలు పట్టుబడి జరిగింది. 10 టన్నుల మేర దిగుబడి వచ్చింది. 25 కౌంట్ రొయ్యలకు కిలోకు గతంలో రూ.550 వరకు ధర వచ్చేది. ఇప్పుడు ప్రభుత్వం రూ.420గా ధర నిర్ణయించింది. రొయ్యల కంపెనీలను కొనుగోలు చేయాలని ఆదేశించింది. అయితే కంపెనీలు నేరుగా రైతుల నుంచి కొనేందుకు నిరాకరించాయి. మధ్య దళారులు రంగ ప్రవేశం చేసి రూ.370కు కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకన్నా కిలోకు రూ.50 తక్కువకు అమ్ముకోవాల్సి వచ్చింది. టన్నుకు రూ.50 వేల చొప్పున మొత్తం 10 టన్నులకు రూ.5 లక్షలు నష్టపోయారు. పిట్టల్లంక గ్రామం సంగా వెంకటకృష్ణారావుకు చెందిన ఎకరంన్నర విస్తీర్ణంలోని చెరువులో రెండు టన్నులు దిగుబడి వచ్చింది. 100 కౌంట్ రొయ్యలను రూ.220కు కొనాలి. కానీ రూ.180లకు మాత్రమే అమ్ముకోగలిగారు. కిలోకు రూ. 40 తక్కువకు కొన్నారు. టన్నుకు రూ.40 వేల చొప్పున రెండు టన్నులకు రూ.80 వేలు నష్టపోయారు. ఈ ఇద్దరి రైతులే పరిస్థితేకాదు...రొయ్యలు సాగు చేసిన రైతులందరి పరిస్థితి ఇలాగే ఉంది.

మచిలీపట్నం, నాగాయలంక, కోడూరు, కృత్తివెన్ను, బంటుమిల్లి, నందివాడ తదితర మండలాల్లోని 33 వేల ఎకరాల్లో రొయ్యలు సాగుచేస్తున్నారు. ఏటా సగటున 75 వేల టన్నులు దిగుబడులు వస్తున్నాయి. ఇప్పుడు ఈ రైతుల పరిస్థితి అమ్మబోతే అడవి..కొనబోతే కొరివి అన్న చందాన మారిపోయింది. ఈ సీజన్లో రొయ్య పిల్ల, మేత, విద్యుత్ బిల్లులు పెరిగాయి. ఎకరా రొయ్యల పెంపకానికి రూ.3.50 లక్షలకుపైగా ఖర్చవుతోందని ఆక్వా సాగుదారులు చెబుతున్నారు. ఈపరిస్థితుల్లోనే అమెరికా, యూరప్ దేశాలకు రొయ్యల ఎగుమతులు తగ్గిపోయాయని చెబుతూ వాటి ధరలను కంపెనీలు తగ్గించి వేశాయి. దీంతో రైతులు నష్టపోకుండా చూసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కనీస ధర నిర్ణయించింది. 20 కౌంట్ రొయ్యలు కిలోకు 450 రూపాయలు, 25 కౌంట్‌కు 420 రూపాయలు, 30 కౌంట్‌కు 380 రూపాయలు, 40 కౌంట్ 340 రూపాయలు, 45 కౌంట్‌కు 300 రూపాయలు, 50 కౌంట్‌కు 290 రూపాయలు, 60 కౌంట్‌కు 270 రూపాయలు, 70 కౌంట్‌కు 250 రూపాయలు, 80 కౌట్‌కు 240 రూపాయలు, 90 కౌంట్‌కు 220 రూపాయలు, 100 కౌంట్‌కు రూ. 210గా ప్రభుత్వం ధర నిర్ణయించింది. అయితే కంపెనీలు నేరుగా రైతుల నుంచి కొనేందుకు నిరాకరిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరలు కూడా రైతులకు దక్కడం లేదు. దళారులు కిలోకు రూ.50 నుంచి రూ.40లకు ధర తగ్గించి కొంటున్నారు. దీంతో వారు మరింతగా నష్టపోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో కంపెనీలు నేరుగా తమ నుంచి రొయ్యలు కొనుగోలు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కోరలుచాస్తున్న 'గ్రీన్‌టెక్' కాలుష్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట

గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ కాలుష్యం కోరల్లో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు చిక్కుకున్నారు. తాజాగా మంగళవారం షేర్ మహమ్మద్‌పేట గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఐదుగురు అస్వస్థతకు గురవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వాంతులు కావడం, తల తిరగటం, కడుపులో తిప్పటం వంటి ఇబ్బందులకు వారు గురయ్యారు. పాఠశాల తరగతి గదులు మూసివేసి మరీ పాఠాలు చెప్పాల్సి రావడం పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలో గల గ్రీన్ టెక్ ఫ్యాక్టరీని తొలగించాలని గత కొన్నేళ్లుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో అనేక రూపాల్లో ప్రజలు ఆందోళనలు నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, తహశీల్దారు, ఎంపిడిఓ, కాలుష్య నియంత్రణ అధికారికి ఇలా అనేక మందిని కలిసి వినతిపత్రాలు సమర్పించారు. కోవిడ్ సమయంలోనే 2,500 మంది సంతకాలు సేకరించి జగ్గయ్యపేట తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా చేసి సంతకాలతో కూడిన వినతిపత్రాలను సమర్పించారు. అయినా ఫలితం లేకుండా పోతోంది. ఫ్యాక్టరీని తరలించే చర్యలు తీసుకుంటామని ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోవడంలేదు. పర్యవసానంగా గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీ నుండి వస్తున్న కాలుష్యంతో గ్రామ సమీపంలో గల మోడల్ కాలనీ, కూతవేటు దూరంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 450 మంది విద్యార్థులపై కాలుష్య ప్రభావం పడుతోంది. రోజూ దుర్వాసనతో విద్యార్థులకు కడుపులో తిప్పటం, తలనొప్పి రావడం, వాంతులు చేసుకోవడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఫ్యాక్టరీ సమీపంలో గల పంట పొలాల్లోకి పనులకు కూలీలు సైతం వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఫ్యాక్టరీ సమీపంలో గల రామచంద్రుని పేట, అనుమంచిపల్లి, షేర్ మమ్మద్‌పేట గ్రామాల ప్రజలు సైతం ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి సమయంలో మరింతగా దుర్వాసనతో ఫ్యాక్టరీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఎండాకాలంలో ఆరుబయట, భవనాలపై నిద్రించే పరిస్థితి కూడా లేకుండా పోతోంది.



గ్రీన్‌టెక్‌ను ఎత్తేయాలని ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు (ఫైల్)



గ్రీన్‌టెక్ ఫ్యాక్టరీలో ఆవరణలో కెమికల్ డ్రమ్ములు (ఫైల్)

అభ్యుదయవాది వాసిరెడ్డి నరసమ్మ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అభ్యుదయవాది, వామపక్ష శ్రేయోభిలాషి, ప్రముఖ అధ్యాపకురాలు వాసిరెడ్డి వెంకట నరసమ్మ విద్యార్థుల్లో ఉన్నత విలువలు, అభ్యుదయ భావాలను పెంపొందించేందుకు తీవ్రంగా కృషి చేశారు. బుధవారం కన్నుమూసిన ఆమె బోటనీ లెక్చరర్‌గా పనిచేస్తూ ఎంతో మందికి ఉన్నత విద్యనందించారు. ఎక్కువకాలం ఆకుకూరు ప్రభుత్వ కళాశాలలో పనిచేసిన ఆమె తన భర్త సత్యనారాయణ అడుగుజాడల్లో నడుస్తూ ఆయనకు పూర్తిగా సహకరించేవారు. సత్యనారాయణకు దక్షిణభారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్యతో ఎంతో అనుబంధం ఉండేది. అభ్యుదయ భావాలతో ఉండే సత్యనారాయణ ఈనాడులో జర్నలిస్టుగా పనిచేశారు. బెంగాల్ వామపక్ష పత్రిక గణశక్తికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి స్పెషల్ కరస్పాండెంట్‌గా ఉంటూ ప్రతిరోజూ విజయవాడ నుండి వార్తలు పంపేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన సిపిఎం జాతీయ మహాసభలు, రాష్ట్ర మహాసభల సమయాల్లో ప్రత్యేక కథనాలను రాశారు. ప్రజాశక్తి దినపత్రికలో వివిధ అంశాలపై నిత్యం వ్యాసాలు రాశారు. చెరకు, పౌల్ట్రీ మాస పత్రికలకు సంపాదకులుగా పనిచేశారు. రైతుల సమస్యలపై అధ్యయనం చేసి పూర్తి అవగాహన కలిగి ఉండేవారు. పలు వ్యాసాలను అనువదించేవారు. వాసిరెడ్డి దంపతులు ప్రజాశక్తికి తమ వంతుగా సహకారం అందించేవారు. భర్త మరణానంతరం కూడా నరసమ్మ ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు.

నేడు అంత్యక్రియలు

వాసిరెడ్డినరసమ్మ అంత్యక్రియులు గురువారం ఉదయం కృష్ణలంక స్వర్గపురిలో జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. మెరీస్‌స్టెల్లా కళాశాల ఎదుట సున్నపు బట్టీలకు వెళ్లే రోడ్ పాత 5వ నెంబర్ రూట్లోని 'ఫెర్టి కాంప్లెక్స్' అపార్టుమెంట్లోని స్వగృహం వద్ద ఆమె భౌతికకాయాన్ని ఉదయం 7 నుండి 10 గంటల వరకు ప్రజల సందర్శనార్థం ఉంచుతామని, అనంతరం అంతిమయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు.

గొప్ప అభ్యుదయవాది

సిపిఎం రాష్ట్ర నాయకులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ

వెంకట నరసమ్మ గొప్ప అభ్యుదయవాది అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు కొనియాడారు. ఆమె ఎంతో మందికి ఉన్నత విద్యనందించారని గుర్తుచేశారు. ఆయుష్ ఆస్పత్రిలో ఆమె భౌతికకాయాన్ని బాబూరావుతోపాటు సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ సందర్శించి నివాళులర్పించారు. ఆమె మృతికి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నరసమ్మ మరణం అభ్యుదయ సమాజానికి తీరనిలోటని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

ప్రజాశక్తి-మైలవరం : రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మారణం చెందిన సంఘటన బుధవారం జి. కొండూరు మండలం గుర్రాజు పాలెం రహదారి వద్ద జరిగింది. వివరాల ప్రకారం



మైలవరం లోని సూరిబాబు పేటకు చెందిన కటారి వెంకటేశ్వరరావు (35) తాపీ పని చేస్తు జివిస్తుండేవాడు. పనుల నిమిత్తం తన ద్విచక్ర వాహనంపై జి కొండూరు వైపు వెళుతున్నాడు. తెలంగాణ రాష్ట్రం విఎం బంజర కు చెందిన అయ్యప్ప స్వామి భక్తులు మిని బస్సులో శబరిమలై వెళ్లి వస్తుండగా గర్రాజుపాలెం సమీపంలో వెంకటేశ్వరరావు ద్విచక్ర వాహనం అదుపు తప్పి మినీ బస్సు ను ఢీకొంది. ఈ ఘటనలో వెంకటేశ్వరరావు అక్కడికక్కడే మతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకొన్న జి కొండూరు ఎస్ఐ ధర్మరాజు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మైలవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ తెలిపారు.

ప్రతిఒక్కరికీ ఆరోగ్య బీమా అవసరం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : అనుకోని సంఘటనలు జరిగి ప్రమాదవశాత్తు కుటుంబ పెద్ద మరణించినపుడు ఆ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేది ఇన్సూరెన్స్ కంపెనీ లేనని జబర్దస్త్ కామెడీయన్ అప్పారావు అన్నారు. పట్టణంలో కోదాడ రోడ్డులో ఉన్న ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఇన్సూరెన్స్ వల్ల కుటుంబాలకు చేకూరే ఉపయోగాల గురించి వివరించారు. సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆరోగ్య బీమా, ప్రమాద బీమాలు కూడా అవసరమేనన్నారు. పెరుగుతున్న ఖర్చుల కనుగుణంగా ఆదాయం లేనప్పుడు ఏవైనా అనుకోని ప్రమాదాలు జరిగినపుడు వారిని ఆర్థికంగా ఆదుకునేది ఇన్సూరెన్స్ కంపెనీలేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ మేనేజర్ కష్ణ వర్ధన్ రెడ్డి, మోటివేటర్ సుబ్బారెడ్డి, బ్రాంచ్ మేనేజర్ హరేరామ శ్రీధర్, యూనిట్ మేనేజర్‌లు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనులు ప్రారంభం

ప్రజాశక్తి -నందిగామ : మండలంలోని మునగచర్ల గ్రామంలో వైయస్సార్ జలకళ పథకంలో భాగంగా ఏర్పాటు చేయనున్న బోర్ వెల్ పనులను శాసనమండలి సభ్యులు డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ముందుగా బోరు యంత్రానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ బీడు భూములకు సైతం సాగునీటిని అందించి సస్యశ్యామలం చేయాలనే తలంపుతోనే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైయస్సార్ రైతు భరోసా పథకంలో భాగంగా వైయస్సార్ జలకళ పథకాన్ని రూపొందించారన్నారు. ఈ పథకం వల్ల ప్రభుత్వమే ఉచితంగా బోర్లు వేయిస్తుందని తెలిపారు. మునగ చర్ల గ్రామంలో వైయస్సార్ జలకళ పథకం ద్వారా మూడు బోర్లు వేస్తున్నామని , రెండున్నర ఎకరాల నుంచి 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులకు పథకం వర్తిస్తుందని తెలిపారు. వైయస్సార్ జలకళ పథకాన్ని అర్హులైన రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామ వాలంటీర్ల ద్వారా పాసుపుస్తకం ,ఆధార్ కార్డుతో సచివాలయంలో పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చుని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆకుల రంగా , గ్రామ నాయకులు చిరుమామిళ్ల వెంకటేశ్వరరావు ,తాళ్లూరి భద్రయ్య పాల్గొన్నారు.

వనసమారాధన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం యువత అసోసియేషన్ ఫోటో గ్రాఫర్స్ మరియు వీడియో గ్రాఫర్స్ యూనియన్ వన సమారాధన కార్యక్రమం ఇబ్రహీంపట్నం మండలం త్రిలోచనాపురంలోని బటర్ ఫ్లై పార్కు వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు ఎం కృష్ణారావు ప్రెసిడెంట్ రత్నకుమార్ సెక్రటరీ పామర్తి రాంబాబు యూనియన్ సభ్యులు కుమ్మరి రాజు ఎర్ర శ్రీనివాసరావు చిన్న అంజి శేఖర్ దేవినేని శ్రీనివాస్ నాగరాజు సభ్యులు పాల్గొన్నారు.

27న రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

ఒప్పంద కార్మికులకు కనీస వేతనాలు అమలు, లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ ఈ నెల 27న విజయవాడలోని యంబి విజ్ఞాన కేంద్రంలో జరుగునున్న రాష్ట్ర సదస్సు జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. కొండపల్లి పారిశ్రామికవాడ హెచ్‌పిసియల్ ఆయిల్ ట్ర క్ టెర్మినల్ ఒప్పంద కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే విధం గా రూపొందించబడిన లేబర్‌కోడ్స్‌ను రద్దు చేసే వరకు వివిధ రూపాలలో ఆందోళనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ సిఐటియు నాయకులు రాజశేఖర్ శేఖర్ చెన్నరావు జయరాజ్ డ్రైవర్స్ యూనియన్ సిఐటియు ప్రెసిడెంట్ సుందరరావు పాల్గొన్నారు.



కరపత్రాలతో ఎన్‌సిహెచ్ శ్రీనివాస్, తదితరులు

క్రీడా పోటీల విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

నేపాల్ లో ఈ నెల 16 నుండి 19వ తేదీ వరకు జరిగిన ఇంటర్నేషనల్ క్రీడా పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ క్రీడాకారులు 18 రకాల కేటగిరుల పోటీల్లో విజయ దుందుభి మోగించారు. అనంతరం బుధవారం వారు నేపాల్ నుండి జగ్గయ్యపేటకు విచ్చేసిన సందర్భంగా శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ నేపాల్ లో జరిగిన ఇంటర్నేషనల్ క్రీడా పోటీల్లో జగ్గయ్యపేట పట్టణానికి చెందిన స్విమ్మర్స్ కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు, వారి బందం జగ్గయ్యపేటకు మంచి పేరు ప్రఖ్యాతలు తీసుకొని వచ్చారన్నారు. జగ్గయ్యపేట డ్రీమర్స్ అసోసియేషన్ నుండి 4 గురు మహిళలు, 7 గురు పురుషులు మొత్తం 11 మంది పాల్గొని 22 పతకాలు సాధించా రన్నారు. 19 స్వర్ణం, 2 రజితం,1 కాంశ్యం పతకాలు కైవశం చేసుకున్నారని తెలిపారు. గతంలో కూడా ఈ 11 మంది రాష్ట్రస్థాయిలోనూ, జాతీయస్థాయిలో గెలు పొందారని తెలిపారు. ఇదేవిధంగా మరెన్నో పతకాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్ వట్టెం మనోహర్, పట్టణ అధ్యక్షులు అకుల శ్రీకాంత్ బాజీ, కష్ణా స్విమ్ అధ్యక్షులు పిన్నెల్లి పాండురంగారావు, గోగిశెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలను అభినందిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

అద్దె చెల్లించలేదని ఊటుకూరు సచివాలయానికి తాళం

ప్రజాశక్తి - గంపలగూడెం : గత మూడేళ్లుగా అద్దె చెల్లింపులేనందున ఏకంగా సచివాలయ సిబ్బందిని బయటకు పంపి తాళం వేసిన సంఘటన గంపలగూడెం మండలం ఊటుకూరు లో జరిగింది. గ్రామానికి చెందిన వేముల ప్రకాష్ బాబ్జి ప్రభుత్వ అధికారుల హామీ మేరకు తన ఇంటిని సచివాలయానికి ప్రతినెల రూ.5500 చొప్పున అద్దె ఖరారుతో 2019 అక్టోబర్ లోఒప్పందం కుదిరింది. ప్రతినెల అద్దె చెల్లించాల్సి ఉండగా మూడు సంవత్సరాలు పూర్తయిన ఏ ఒక్క రూపాయి జమకాలేదు. ఈ విషయమై పలుమార్లు రాతపూర్వకంగా బాబ్జి స్పందన కార్యక్రమం, అధికారులు, నాయకుల దష్టికి తెచ్చిన ఫలితం లేదు. దీనితో అసహనానికి గురైన బాబ్జి బుధ వారం సిబ్బందిని బయటకు పంపి, సచివాలయానికి తాళం వేశారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి -నందిగామ : నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బొక్కా జార్జి ముల్లర్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ చర్మ పరిశ్రమాభివద్ధి సంస్థ (లిడ్ క్యాప్) కార్యాలయంలో లిడ్ క్యాప్ చైర్మన్ ,రాష్ట్ర వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి కాకూమాను రాజశేఖర్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ వారు నిర్వహించు రాష్ట్ర, జిల్లా స్థాయి సమావేశాలలో లిడ్ క్యాప్ ప్రతినిధులు పాల్గొని లిప్ క్యాప్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాలను తెలియజేసి బడుగు బలహీన వర్గాలైన వారికి చేయూతను కల్పించాలని లిడ్ క్యాప్ చైర్మన్ ని రాష్ట్ర నాయకులు కోరారు. లీడ్ క్యాప్ చైర్మన్ ను కలిసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి జిల్లేపల్లి రాజేశ్వరి, కోస్టల్ కోఆర్డినేటర్ పాల్ శంకర రెడ్డి రాష్ట్ర ఎస్సీ విభాగపు అధ్యక్షురాలు జస్వంతరాణి రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి సుజాత ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు హనోకు రాజేష్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నందిగామను మరింత అభివృద్ధి చేస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -నందిగామ

నందిగామను మరింత అభివద్ధి చేయడానికి ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్‌లో నవనందిగామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో నందిగామ పట్టణానికి చెందిన ప్రముఖులు ,మేధావులు, విద్యావేత్తలు పాల్గొని నందిగామ అభివృద్ధిపై వారి వారి అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ పలు సలహాలు సూచనలు ఇచ్చారు. రాజకీయాలకు అతీతంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ముఖ్య అతిథులుగా శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ నందిగామ ప్రజల సహకారంతో నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కషి చేశామని తెలిపారు. కొంతమంది రాజకీయ ప్రయోజనాల కోసం అభివద్ధి పనులకు అడ్డుపడటం మంచి పద్ధతి కాదన్నారు. ఈ సమావేశంలో విద్యాసంస్థల అధినేతలు కాపా రవీంద్రబాబు – అమరనేని రమేష్ బాబు, ఆళ్ళ రాంబాబు, పట్టణ ప్రముఖులు న్యాయవాదులు మన్నెం నారాయణరావు, ఈశ్వరప్రగడ జగన్నాథరావు, రిటైర్డ్ ఎంఈఓ కుమార్ , గోపు నరేంద్ర, విద్యావేత్తలు జీడిఎంఎం ప్రసాద్ , ప్రతిభా ఖాసిం ,దీక్ష హనిఫ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహన్‌రావు

'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : పట్టణంలోని 13వ సచివాలయం పరిధిలోని 27, 28 వార్డులలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన కొనసాగిస్తు న్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, హఫీజున్నిసా ఫిరోజ్ ఖాన్, పట్టణ అధ్యక్షులు ఆకుల శ్రీకాంత్ బాజీ, యువజన విభాగం అధ్యక్షులు ఆవాల భవాని ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు మోరే రామారావు, బాబి, వట్టెం మనోహర్ పాల్గొన్నారు.

26న సిఐటియు మండల మహాసభ

ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల మండల సిఐటియు మహాసభ ఈ నెల 26 న శనివారం స్థానిక యన్జీఓ హెూం లో నిర్వహిస్తున్నట్లు మండల శాఖ అధ్యక్షుడు బెజ్జం భూషణం, ఉపాధ్యక్షుడు సయ్యద్ ఖాశిం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మహాసభలో జిల్లా కార్యదర్శి యన్ సి హెచ్ శ్రీనివాస్, హాజరౌతారన్నారు. మండలం సిఐటియు అనుబంధ సంఘాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

విద్యార్థులకు మాజీ ఎంఎల్ఏ తాతయ్య పరామర్శ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట : మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అతి దగ్గరలో గల గ్రీన్ టెక్ కెమికల్ ఫ్యాక్టరీ నుండి వచ్చే దుర్వాసనకు విద్యార్థులు వాంతులు, తలనొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ బుధవారం షేర్ మహమ్మద్ పేట గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులతో కలిసి పాఠశాలలో విద్యార్థులను పరామర్శించి అనంతరం పాఠశాలకు దగ్గరలో ఉన్న కెమికల్ ప్లాంట్ ను పరిశీలించారు. బోర్ లోని వాటర్ వాసన వస్తోందని, రాత్రిపూట నిద్రపోవడానికి కూడా ఈ వాసనతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు రాజగోపాల్ కు వివరించారు. దీనిపై గ్రామస్తులు స్థానిక తహసిల్దార్ దృష్టికి తీసుకువెళ్లగా త్వరలోనే క్లోజ్ చేస్తామని హామీ ఇచ్చారని కానీ ఇంతవరకు ఆ సమస్యను పరిష్కరించ లేదని తెలిపారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ ప్రజలు నివసించే ప్రాంతానికి దగ్గరలో గ్రీన్ టెక్ ఇండస్ట్రీ ను ఏర్పాటు చేసి యాజమాన్యం వారి ఇష్ట రాజ్యంగా పొల్యూషన్ విపరీతంగా వదులుతోందన్నారు. దీనివలన గ్రామంలోని ప్రజలు, దగ్గరలో ఉన్న పాఠశాల విద్యార్థులు, వ్యవసాయ రైతులు, కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికారులు దీనిపై చర్యలు తీసుకోకపోతే గ్రీన్ టెక్ ఇండస్ట్రీని మూసెంతవరకు గ్రామస్తులతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. గ్రామ ప్రజలు, గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీరాం రాజగోపాల్

హమాలీ కార్మికులకు సంక్షేమ బోర్డు : సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

పట్టణాల్లో మండల కేంద్రాలలో ప్రజల నిత్యవసర సరుకులు ఉత్పత్తుల ఎగుమతి దిగుమతి ద్వారా వేల కోట్ల రూపాయలు స్థానిక సంస్థలకు ఆదాయం సమకూర్చుతున్న హమాలీలకు పని భద్రత, సాంఘిక భద్రత లేని పరిస్థితి ఉందని, కావునా హమాలీలకు సంక్షేమ బోర్డుని ఏర్పాటు చేసి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలని కృష్ణా జిల్లా సిఐటియు ఉపాధ్యక్షులు మద్రాపు పోలి నాయుడు డిమాండ్ చేశారు. మంగళవారం కృష్ణాజిల్లా హమాలి ముఠా వర్కర్స్, పౌరసరఫరాల సంస్థ హమాలీ యూనియన్ కృష్ణా జిల్లా ఎనిమిదవ మహాసభ స్థానిక జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పోలినాయుడు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు హామాలి కార్మికులకు సంక్షేమ కార్యక్రమాల అమలు చేయకుండా కార్మికులను మోసగిస్తుందని, స్థానిక వాణిజ్య సంస్థలకు వేల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుస్తున్న వీరికి ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ,పిఎఫ్ అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కృష్ణా జిల్లా హమాలీ ముఠా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సివిల్ సప్లై హమాలి కార్మికులకు నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించి సంక్షేమ కార్యక్రమాలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సివిల్ సప్లై హమాలి కార్మికుల కూలి వేతనాలు ఒప్పందం జరిగే రెండు నెలలు అవుతున్నా ఏరియర్స్ చెల్లించిన పరిస్థితి ఉందన్నారు. సివిల్ సప్లై హమాలి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం అనంతరం జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న పోలి నాయుడు

అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గా కే. శంకర్ ,జై.నాగ శివ ,ఉపాధ్యక్షులు గా ఏ శ్రీను,సహాయ కార్యదర్శిగా జె.నాగరాజు, కోశాధికారిగా జే ప్రభుదాస్, కమిటీ సభ్యులుగా జె . రాము,కే. శ్రీను,ముత్యాల రవి,యేసు ,రామకష్ణలను ఎన్నుకున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం శివారు మర్లపాలెం చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు మర్లపాలెం గ్రామానికి చెందిన షేక్ నాగూర్ (50)గా గుర్తించారు. గత రెండు రోజులుగా అతను కనపడలేదని చెప్పారు. మద్యం మత్తులో కాలకృత్యాలకు రాత్రిపూట వెళ్లడంతో చెరువులో పడినట్లు బంధువులు వెల్లడించారు.

అన్నదానం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు

స్థానిక లయన్స్ సేవా భవనంలో బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు సింగంశెట్టి ఆదినారాయణ తెలిపారు. కారిచర్ల నాంచారయ్య వారి ధర్మపత్ని కమలమ్మ జ్ఞాపకార్థం 100 మందికి అన్న సమారాధన కార్యక్రమాన్ని వారి కుటుంబ సభ్యులు కృష్ణ సారథి, నాగమణి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు, దాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

జె టాక్స్‌లతో రాష్ట్రం సర్వనాశనం : కొల్లు



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జగన్మోహన్ రెడ్డి అధికారంలో వచ్చినప్పటి నుంచి రాష్ట్రం అంతా అస్తవ్యస్తంగా తయారు చేశారని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు కొల్లు రవీంద్ర విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో జె టాక్స్ లు చెల్లించలేక పారిశ్రామిక వేత్తలు పారిపోతున్నరన్నారు. ఇదిలా తాము ఏమి తక్కువ కాదన్నట్లు కొంతమంది మంత్రులు మాత్రం ప్రజలను దోపిడీ చేసేదాంట్లో బిజీగా ఉన్నారన్నారు. చెరువులు తవ్వాలంటే లంచం, ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే లంచం, స్థలాలు కొనుగోలులో లంచం, వాటిని మట్టితో పూడ్చేకి కమిషన్, పుట్టిన కమిషన్, చచ్చిన కమిషన్ ఇచ్చి చావాలి జగన్ ప్రభుత్వంలో అని ప్రజలు తిట్టుకుంటున్నారన్నారు. . హౌసింగ్ మంత్రి సొంత నియోజక వర్గంలో ఒక్క ఇళ్లైనా కట్టాడా అని ప్రశ్నించారు. చంద్రబాబును, పవన్ కళ్యాణ్ ను విమర్శించడం తప్పా మంత్రి ఏం సాధించారో చెప్పాలన్నారు. అబివృవద్ధిపై చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మాజీమంత్రి పేర్నినాని విషయం అయితే ఆయన అక్రమాస్తుల చిట్టాలు రాష్ట్రాల సరిహద్దులు దాటుతున్నాయని, బందరులో షాడో నాయకుల వసూళ్ల చరిత్ర జగన్ మోహన్ రెడ్డి హార్డ్ డిస్కులు నిండుతు న్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ నాయకులకు కనీసం డిపాజిట్లు కూడా రావని తెలిసి జగన్ రెడ్డి కి చెమటలు పడుతున్నాయన్నారు. ఈ సమావేశంలో పార్టీ నగర,రూరల్ అధ్యక్ష కార్యదర్శులు ఇలియాస్ పాషా,కాంతారావు,కుంచె నాని,లు ఉన్నారు.

129 మందికి ఇద్దరే ఉపాధ్యాయులు

- విద్యార్థుల ఇబ్బందులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 129 మంది విద్యార్థులు గుడ్లవల్లేరు వన్ పాఠశాలలో విద్యను అభ్యసిస్తుండగా ఆ పాఠశాలలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు సరైన విద్య అందడంలేదని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయునిని ఈ విషయంపై ప్రశ్నించగా అదనపు ఉపాధ్యాయులను కేటాయించాలని మండల విద్యాశాఖ అధికారిని కోరామని చెప్పారు. 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, 98 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేయాలని జిల్లావిద్యాశాఖ ఉత్తర్వులు ఉన్నాయి. అయితే మండలంలో ఆ ఆదేశాలు మండలంలో కనిపించడం లేదు. ఉపాధ్యాయుల కొరతపై మండల విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యంని వివరణ కోరగా మండలంలోని కొన్ని పాఠశాలలో అధికంగా ఉన్నా ఉపాధ్యాయులను డిప్యుటేషన్ పై ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలకు పంపుతామని తెలిపారు.



కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

గుడివాడ : రాష్ట్రంలో పారిశుద్ధ్య కార్మికులను ప్రభుత్వం మోసం చేస్తుందని, ఎన్నో సంవత్సరాలుగా సాధించుకున్న కార్మికుల హక్కులను నేటి పాలకులు అణగదొక్కడానికి ప్రయత్నిస్తున్నారని ఏపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె. ఉమా మహేశ్వరరావు విమర్శించారు. బుధవారం స్థానిక ఎన్‌జీవో హూమ్‌లో జిల్లా 2వ మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రాణంత కరమైన కరోన సమయంలో పారిశుద్ధ్య కార్మికులు అనేక సేవలు అందించారన్నారు. ఆ సమయంలో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా గుర్తుంపు పొందిన 200 మంది చనిపోయినప్పటికి వారికి అందవలసిన ఎక్స్‌గ్రేసియను నేటి వరకు చేల్లించకపోవడం దారుణమన్నారు. కాంట్రాక్టు కార్మికులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలన్నారు. నేడు పెరిగిపోతున్న నిత్యావసర ధరకలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. కార్మికలకు పిఎఫ్, ఇఎస్ఐను వర్తింపు చేయాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి జ్యోతిబాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సిఐటియు నాయకులు ఆర్.సిపి రెడ్డి, నాయకులు ధనల సత్యనారయణ, వై.సరళ, బాలకృష్ణ, నారాయణ, సోమేశ్వరరావు కార్మికుల పాల్గొన్నారు. అనంతరం జిల్లా నూతన కమిటిని ఏకగ్రీవం ఎన్నుకున్నారు. నూతన జిల్లా అధ్యక్షులుగా ధనల సత్యనారయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనికొండ నాగమల్లేశ్వరరావు, కోశాధికారిగా బి.బాలకృష్ణ, గౌరవ అధ్యక్షులు సుబ్రహ్మణం, ఉపాధ్యక్షులుగా వై.సరళ, సహయ కర్యదర్శిగా కైలే ప్రసాద్, కమిటి సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

లింగ వివక్ష వ్యతిరేక ప్రచార కార్యక్రమాలను విజయవంతం చేయాలి

- డిఆర్‌డిఏ పీడీ ప్రసాద్



ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : సమాజంలో మహిళలు హింస లేకుండా గౌరవప్రదంగా తమ హక్కులు కాపాడుకుంటూ జీవించేందుకు కృషి చేయాలని జిల్లా గ్రామీణ అభివద్ధి సంస్థ పదక పథక సంచాలకులు పీఎస్ఆర్ ప్రసాద్ సూచించారు. లింగ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా ఈ నెల 25 నుండి డిసెంబర్ 23 వరకు జాతీయ ప్రచారాన్ని నిర్వహించడంలో భాగంగా మార్గ దర్శక సూత్రాలు జారీ చేసేందుకు బుధవారం డి ఆర్‌డిఏ పథక సంచాలకులు కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు గ్రామాల్లో వివక్ష లేకుండా, జీవిస్తూ గహ హింసకు తావులేకుండా సమన అవకాశాలతో జీవించేలా చేయడానికి నెలరోజుల పాటు గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గ దర్శకాలకు అనుగుణంగా రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ రూపొందించిందని తెలిపారు. ఇందుకు గాను మండల ,గ్రామ స్థాయిలో కో ఆర్డినేషన్ కమిటీలు ఏర్పాటుచేస్తామన్నారు. ఈ అవగాహన సమావేశాలు ఆంగాన్‌వాడీ, పాఠశాలల్లో, గ్రామ సంఘాలలో నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ డిడి, కె.సరస్వతి, ఐసిడిఎస్ పిడి ఎస్.సువర్ణ,వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ప్రభుత్వం కేటాయించడం ధరకే రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయాలని కౌలు రైతుల సంఘం జిల్లా నాయకులు బి వి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ధాన్యానికి ప్రభుత్వ మద్దత ధర ఇవ్వాలని కోరుతూ బుధవారం అంగలూరులో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం క్వింటాకు 2000 ధరను నిర్ణయించగా, కొంతమంది మిల్లర్లు, ప్రైవేట్ వ్యాపారస్తులు కుమ్మక్కై 1150 కి కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనిని తిప్పి కొట్టేందుకు రైతులు అందరూ సిద్ధం కావాలని అన్నారు. ధాన్యం అమ్ముకోవడానికి సాగు ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం ఆర్.బి కె అధికారికి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ప్రజాశక్తి-మోపిదేవి : మండల కేంద్రం మోపిదేవి గ్రామ కూడ లిలోనూ, రహదారి వెంబడి రహదారిని ఆక్రమించి చిరు వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపారులను బుధవారం అధికారులు ఖాళీ చేయించారు. మోపిదేవి ఎస్ఐ సిహెచ్ పద్మ, గ్రామపంచాయతీ కార్యదర్శి కమ్మిలి త్రిపుర సుందరి, గ్రామ పంచాయతీ సిబ్బంది, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సహాయంతో రహదారిని ఆక్రమించిన టీ స్టాల్స్, వివిధ బొమ్మల కొట్టులు, తోపుడుబండ్ల వ్యాపారులను ఖాళీ చేయించారు. చిరు వ్యాపారుల దిక్కుతోచని స్థితిలో వారి వారి సామాన్లను వారి సొంత నివాసాలకు తరలించుకున్నారు. ఈ విషయమై ప్రజాప్రతినిధులు , ప్రజా నాయకులు, స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయా వ్యాపారులు కోరుకుంటున్నారు.

లక్ష్యసాధనకు విద్యార్థులు కృషి చేయాలి : డిఆర్‌ఒ

ప్రజాశక్తి-వన్‌టౌన్: విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి మోహనకుమార్ అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల డిబైటింగ్ అండ్ క్విజ్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సారస్వత పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదన్నారు. విద్యార్థులు నిరంతరం శ్రమిస్తూ ముందుకు సాగినప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధిస్తారన్నారు. మారుతున్న కాలానుగుణంగా ఆ రంగాల్లో వస్తున్న మార్పులపై అవగాహన పెంచుకోవాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన కళాశాల



విద్యార్థులకు బహుమతిని అందజేస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి

ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కేబీఎన్ కళాశాల విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు కషి చేస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల్లోని సజనాత్మకత, వ్యక్తిత్వ వికాసానికి పదును పెట్టేందుకు ఈ పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. కేబీఎన్ కళాశాల విద్యారంగానికి అపూర్వమైన సేవలు అందిస్తుందని ప్రశంసించారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యకుమార్, డిబేటింగ్ అండ్ క్విజ్ క్లబ్ కన్వీనర్ శాంతి, అధ్యాపకులు వి.శేషగిరిరావు, విజయకుమార్, ప్రత్యూష, డి.పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో అధ్యయన కమిటీ పర్యటన

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు : రాష్ట్రంలోని రైతు భరోసా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను అధ్యయనం చేసేందుకు బుధవారం పెనుగంచిప్రోలుకు కేంద్ర ప్రభుత్వ కో ఆపరేషన్ డిప్యూటీ సెక్రటరీ సందీప్ కుమార్ సింగ్ వచ్చి వాటి పని తీరును పరిశీలించారు. ప్రతి యొక్క అంశాలను ఆయన క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. రైతు భరోసా కేంద్రల ఆవశ్యకత, రైతులకు మేలు ఏమేరకు మేలు చేకూరుస్తానాయి, సద్వినియోగం జరుగుతుందా, రైతులకు లాభమా అనే అంశాలపై పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కావలసిన అన్ని సేవలు ఒకే చోట నుండి అందుతున్నాయని కొనియాడారు. ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం అందించడం గొప్ప విషయం అని అన్నారు. కేంద్రం కూడా పలు రాష్ట్రాల్లో ఈవిధంగా రైతు భరోసా కేంద్రల ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తుందని తెలిపారు. ఒకొక్క రాష్టంలో అక్కడ వున్న పరిస్థితులు అణుగుణంగా పంటలు పండిస్తున్నారని, కానీ ఇక్కడ మాత్రం ప్రభుత్వం, రైతులు కాలానికి అనుగుణంగా అడుగులు వేస్తూ ముందుకు పోతున్నారని, రాయితీలు, ప్రోత్సాహకాలు రైతులకు మేలు చేకూరుస్తానాయి అన్నారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంను పరిశీలించారు.



ఎస్‌బిఐకు దుర్గగుడి బంగారం

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి, విజయవాడ నందు హుండీల ద్వారా వచ్చిన మిశ్రమ బంగారం, నిరుపయోగంగా ఉన్న బంగారు వస్తువులను మరియు అలంకారానికి వినియోగపడని బంగారు వస్తువులు ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం గోల్డు బాండ్ స్కీము రూపంలో మార్చుటకుగాను కమిటీని ఏర్పాటు చేసి వచ్చిన 7.900 కిలోల బంగారాన్ని స్టేట్ బ్యాంక్ అధికారులకు బుధవారం అప్పగించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, రీజనల్ జాయింట్ కమిషనరు, మల్టీజోన్ -1 , దేవాదాయ శాఖ, రాజమహేంద్రవరం ఎం.వి.సురేష్ బాబు, జ్యూవలరీ వెరిఫికేషన్ ఆఫీసర్ దుర్గాభవానీ, బి.వి.రెడ్డి సమక్షంలో బంగారాన్ని అప్పగించారు.

లంక భూముల పరిశీలన

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం గనిఆత్కూరు గ్రామానికి చెందిన లంక భూములను బుధవారం జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు పరిశీలించారు. గత కొంత కాలంగా శ్రీరామ ఫీల్డ్ సొసైటీ, ముప్పాళ్ళ లక్ష్మయ్య ఫీల్డ్ సొసైటీల మధ్య లంక భూముల లీజు విషయంలో వివాదం నడుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. గని ఆతుకూరు రెవెన్యూ పరిధిలో లంక భూముల లీజు విషయంలో ఫీల్డ్ సొసైటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో కోర్టు ఇచ్చిన సూచనల మేరకు భూములను కలెక్టర్ ఢిల్లీ రావు పరిశీలించారు. ట్రాక్టర్ పై వెళ్లి కలెక్టర్ లంక భూములను పరిశీలించారు. రెండు సొసైటీల సభ్యుల వివరాలు తనకు పంపించాలని అధికారులను ఆదేశించారు. పరిశీలించిన అనంతరం కోర్టు ఇచ్చిన సూచనలకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటానని సొసైటీ సభ్యులకు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ రవీంద్రరావు, తహసిల్దార్ వి. రాజకుమారి, డిప్యూటీ తహసిల్దార్ నాగుల్ మీరా, ఆర్ఐ శిరీష రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టిపి రోడ్డు పూర్తి చేయాలని ధర్నా

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని పాతబస్తీలో ప్రధాన రహదారి తమ్మిన పోతరాజు రోడ్డు (టీపీ రోడ్డు, కేటీ రోడ్డు) పునర్నిర్మాణ పనులు తక్షణమే పూర్తి చేయాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఏడాది నుంచి టీపీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతుండటంతో పాటు వాహనాల రాకపోకలను నిలిపివేయడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యాన బుధవారం ధర్నా నిర్వహించారు. తమ్మిన పోతురాజు విగ్రహం వద్ద నిర్వహించిన ధర్నాలో కోటేశ్వరరావు మాట్లాడుతూ నగరపాలక సంస్థ పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా పాతబస్తీ వాసులు ఏడాది నుంచి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కాంట్రాక్టర్‌కు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దీనివల్ల చిట్టినగర్ నుంచి వన్‌టౌన్‌కు రాకపోకలు నిలిచిపోయాయన్నారు. ప్రజల ఇబ్బందులను పట్టించుకోకుండా ప్రత్యామ్నాయ మార్గాలను చూపించకుండా ట్రాఫిక్‌ను నిలిపివేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర సహాయ కార్యదర్శులు లంకా దుర్గారావు, నక్కా వీరభద్రరావు, కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడియ్య, మూలి సాంబశివరావు, పంచాదార్ల దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమానికి అధిక ప్రాధాన్యత : విష్ణు



ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్రంలో నవరత్నాల పథకాల ద్వారా ప్రజల సంక్షేమాభివద్ధికి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి బాటలు వేస్తున్నారని ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం అజిత్‌సింగ్ నగర్లో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎండి రుహల్లా, నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ ఎండి షాహినా సుల్తానాలతో కలిసి ఆయన పాల్గొన్నారు. సైడ్ కాలువల్లో నీరు పారేలా ఎప్పటికప్పుడు మురుగు తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. దోమలు చేరకుండా ఎప్పటికప్పుడు మందు పిచికారీ చేయాలన్నారు. గుజ్జల సరళాదేవి కళ్యాణ మండపం తూర్పు వైపు గోడ ఎత్తును పెంచి ఆకతాయిలు ప్రవేశించకుండా ఫెన్సింగ్‌తో పరిరక్షించాలని అధికారులకు సూచించారు. అనంతరం రైతు బజార్‌ను సందర్శించి, కూరగాయలు అందుబాటులో ఉన్నదీ, లేనిదీ వినియోగదారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అంబేద్కర్, డీఈ రామకష్ణ, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సిడిఓ జగదీశ్వరి, నాయకులు హఫీజుల్లా, దేవిరెడ్డి రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

బిసిలపై కపట ప్రేమ : టిడిపి

ప్రజాశక్తి-వన్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బీసీల పట్ల కపట ప్రేమ చూపుతోందని, గత మూడున్నర సంవత్సరాల కాలంగా బీసీ కార్పొరేషన్లకు కానీ, బీసీలకుగానీ నిధులు, చేతివత్తి పనిముట్లు విడుదల చేయలేదని టిడిపి రాష్ట్ర నగరాలు సాధికార సమితి కన్వీనర్ మరుపిళ్ల తిరుమలేష్ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని బీసీల పక్షపాతి అని పొగడ్తలతో ముంచెత్తడం ఆర్.కష్ణయ్యకు బీసీల పట్ల ఉన్న కపట ప్రేమకు నిదర్శమన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన టిడిపిపై విమర్శలు చేయడం మానుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో బీసీలకు ఎన్టీఆర్ విదేశీ విద్యాధరణ పథకం కింద విదేశాలకు వెళ్లిన బీసీ విద్యార్థులకు ఆర్థిక సాయం చేసి ఆదుకున్నారని తెలిపారు. ఈ ప్రభుత్వంలో ఈ పథకాన్ని కూడ నీరు కార్చారన్నారు.



వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ : సిఎండి

ప్రజాశక్తి-విజయవాడ: డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను తగ్గించి వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలని ఎపిసిపిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సిఎండి) జె పద్మజనార్ధన్‌రెడ్డి విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. కంపెనీ పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్స్, ఎంబిఎ విభాగాల ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో విజయవాడ సెంట్రల్ ఆఫీసులో బుధవారం సిఎండి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అంతరాయం లేకుండా అందించడానికి విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 33/11 కెవి సబ్‌స్టేషన్లలోని పవర్‌ట్రాన్స్‌ఫార్మర్లను, బ్రేకర్లను నిర్ణీత సమయములో తనిఖీలు నిర్వహించి, వాటి మరమ్మతులను పూర్తి చేసి, వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్‌ను అందించాలని కోరారు. విద్యుత్ ప్రమాదాలను కూడా నివారించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కృష్ణా, గుంటూరు, ఒంగోలు జిల్లాలకు సంబంధించిన సూపరింటెండింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు డి సుబ్బారావు, వి రవి పాల్గొన్నారు.



కార్తీక దీపాలంకరణ

ప్రజాశక్తి-భవానీపురం

కార్తీక మాసం చివరిరోజు పురస్కరించుకొని భవానీపురం ఊర్మిళానగర్‌లో వేంచేసియున్న శ్రీ మాత గోవింద మంభా సమేత శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వామి దేవస్థానం నిర్వాహకులు కంది శ్రీనివాస రెడ్డి సోదరుల ఆధ్వర్యంలో బుధవారం మహిళలు శివ లింగం ముగ్గులు వేసి కార్తీక దీపాలను అలంకరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు మరియు పూజారి సంభన దుర్గ చార్యులు భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి-తిరువూరు

రైతులు తగిన మోతాదులో పురుగు మందులు పిచికారీ చేయాలని శిక్షణా కేంద్రం జిల్లా కోఆర్డినేటర్ టి.మాధవిలత సూచించారు. వామకుంట్ల గ్రామంలో రైతులకు యాజమాన్య పద్ధతులపై బుధవారం శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ యాజమాన్య పద్ధతులలో భాగంగా వేసవిలో లోతు దుక్కులు, విత్తన శుద్ధి చేయడం, కాలి బాటలు తీయడం, సిఫారసు చేసిన ఎరువులు, కలుపు, పురుగు మందులు సిఫారసు చేసిన మోతాదులో వాడుతూ నాణ్యమైన దిగుబడిని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.కెనడి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజశేఖర్, శిక్షణాకేంద్రం మా స్టర్ ట్రైనర్స్ ఆర్.సురేష్, టిప్పు సుల్తాన్, మండల వ్యవసాయ అధికా రిణి పద్మ పాల్గొన్నారు.

పాఠశాలల్లో సదుపాయాల కల్పనకు ధర్నా

ప్రజాశక్తి-తిరువూరు

తిరువూరు సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందించాలని టిఎన్ఎ స్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు బుధ వారం ధర్నా చేశారు. లోపలకు వెళ్ళ టానికి నాయకులు ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వం పై, పాఠశాల ప్రిన్సిపాల్ కు వ్యతిరేకం గా నినాదాలు చేసిన నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేష న్ కు తరలించారు. ఈకార్యక్రమంలో నాయకులు చావా సతీష్, చరణ్ సా యి, దొండపాటి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

డిడిఒ పవర్స్ ఉత్తర్వుల అమలుకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: మునిసిపల్ టీచర్లకు డ్రాయింగ్ అధికారాలు, మునిసిపల్ హైస్కూల్స్‌లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులకు డ్రాయింగ్ అండ్ డిస్బుర్సమెంట్ అధికారాలు కల్పిస్తూ విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయాలని కోరుతూ యుటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో డిఇవో రేణుకకు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా యుటిఎఫ్ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు కె.శ్రీనివాసరావు, ఎ.సుందరయ్య మాట్లాడుతూ ఇప్పటికే మండల విద్యాశాఖాధికారి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్లు డ్రాయింగ్ అండ్ డిస్బర్స్‌మెంట్ అధికారులుగా వ్యవహరిస్తున్నారన్నారు. మునిసిపల్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల జీత భత్యములు చెల్లించుటకు వారికితగు ఆదేశాలు ఇవ్వాల్సిందిగా కోరారు. మునిసిపల్ హైస్కూల్ ప్రాధానోపాధ్యాయులకు డీడీఓ అధికారాలు కొత్తగా కల్పించినందున వారికి డిడిఓ నంబర్లు కేటాయిస్తూ జీత భత్యములు డ్రా చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉందన్నారు. దీని నిమిత్తం



డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

మునిసిపాలిటీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల క్యాడర్ స్ట్రెంత్ వివరాలు జిల్లా ఖజానా అధికారులకు పంపాల్సి ఉందన్నారు. కావున తమ విజ్ఞప్తిని పరిశీలించి మునిసిపల్ కమీషనర్ల నుండి ఉపాధ్యాయుల వివరాలను రాబట్టి వారి క్యాడర్ స్ట్రెంత్ వివరాలు జిల్లా ఖజానా అధికారులకు సత్వరమే పంపుటకు తగు చర్యలు చేపట్టవలసినదిగా కోరారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం : జోగి

ప్రజాశక్తి-బంటుమిల్లి

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు సమూలంగా మార్చేందుకు మన బడి, నాడు-నేడు కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ కొనియాడారు. కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మన బడి నాడు - నేడు 2 వ ఫేజ్ లో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన , నాలుగు ఆదనపు తరగతి గదుల నిర్మాణానికి రూ.88,98,685లతో చేపట్టిన పనులకు బుధవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను ప్రస్తుతం ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేర్చే లక్ష్యంతో రెండో విడత పనులు రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీలు, ఆయా పాఠశాలల హెచ్ఎంలతో కూడిన బ్యాంకు అకౌంటులో ప్రభుత్వం నాడు-నేడు రివాల్వింగ్ ఫండ్ విడుదల చేస్తున్నారన్నారు. ఈ ఫండ్‌తో అభివృద్ధి పనులు శరవేగంగా నేడు వివిధ ప్రాంతాల్లో జరుగుతున్నాయని ఆయన చెప్పారు. నాడు-నేడు మొదటి విడతలో పని చేసిన అనుభవం ఉన్న ఎంఈఓ, ఏఈ, హెచ్ఎంలు, పేరెంట్ కమిటీల సభ్యులు, సిఆర్పీలు, ఎమ్మార్సీలో పని చేస్తున్న ఎంఐఎస్, ఎల్డీఏ, మండల లెవెల్ అకౌంటెంట్స్‌తో పాటు మిగిలిన సిబ్బంది, సచివాలయంలో పని చేస్తున్న ఇంజినీరింగ్ సిబ్బందితో రెండో విడత పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసేందుకు యంత్రాంగం సన్నద్ధమైందన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి జోగి రమేష్

కృత్తివెన్ను మండలం ఇంతేరు గ్రామం నుంచి చిన పాండ్రాక గ్రామాల మధ్య 5.6 కిలోమీటర్ల మేర రూ.1.17 కోట్ల ఓ.ఎన్.జీ.సి నిధుల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న పక్కా బీటీ రోడ్డుకు మంత్రి జోగి ప్రారంభోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో కృత్తివెన్ను సర్పంచ్ పెదసింగు మోకమ్మ, వైసిపి మండల అధ్యక్షులు వైదాని వెంకట రాజు, జెడ్పీటీసీ సభ్యులు మైలా రత్నకుమారి, ఎంపీపీ కూనసాని గరుడా ప్రసాద్, బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చిన్నబాబు, ఎంపీటీసీ చింతా వడ్డీ కాసులు, బ్యాంకు ప్రెసిడెంట్ లక్ష్మోజి, బంటుమిల్లి మండల కన్వీనర్ మలిశెట్టి రాజబాబు, ఎంపీడీవో జి.పిచ్చుబాబు, డిప్యూటీ తాసిల్దార్ శశికుమార్, ప్రధానోపాధ్యాయురాలు సి హెచ్ శ్రీవాణి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ రామాని అరుణ, ఆర్కే విక్రమ్ రాజు, ఎద్దు చంద్రశేఖర్, ఎస్.సునీల్ గవాస్కర్, నాగార్జున వెంట్రుపాటి సుశాంత్, ఏడి నాగబాబు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్ట్

ప్రజాశక్తి-అవనిగడ్డ

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ మండలస్థాయి పరీక్షల పోటీలు అవనిగడ్డలోని గ్రంథాలయంలో బుధవారం నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రైవేటు విద్యాసంస్థల నుండి విద్యార్థులు జిల్లాస్థాయి పరీక్షకు అర్హత సంపాదించాలని జన విజ్ఞాన వేదిక కష్ణా జిల్లా సమన్వయకర్త డాక్టర్ శంకరానంద్ కోరారు. మండల స్థాయి పరీక్షల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు కావ్య శ్రీ, కృష్ణ చైతన్య ప్రగతి పాఠశాలకు చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి పల్లవి విజేతగా నిలిచి జిల్లా పోటీలకు అర్హత సాధించారు. ఈ కార్యక్రమంలో హెడ్ పోస్ట్ మాస్టర్ సింహాద్రి రామలింగేశ్వరరావు, గ్రంథాలయ అధికారి జే.ప్రభుదాస్ పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు వీరే...

వేగంగా ధాన్యం కొనుగోళ్లు : జెసి

ప్రజాశక్తి-బంటుమిల్లి

రైతుల ఇబ్బందులు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశించారు. బుధవారం బంటుమిల్లి మండలం మల్లేశ్వరం గ్రామంలోని మార్కెట్ యార్డ్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు జరిగిన ధాన్యం కొనుగోలు వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి వారి ఇబ్బందులను కూడా ఆయన ఆరా తీశారు. సంబంధించిన అధికారులు, కొనుగోలు కేంద్రం సిబ్బంది మాట్లాడుతూ రైతుల ఇబ్బందులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జెసి సూచించారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి మహేష్‌కుమార్

30కల్లా అప్రోచ్ రోడ్లు పూర్తి : కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

జిల్లాలో జగనన్న లేఅవుట్లలోని లెవెలింగ్, అప్రోచ్ రోడ్ల నిర్మాణాలు ఈనెల 30 కల్లా పూర్తికావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తన చాంబర్ నుండి ఆర్డీఓలు, ఎంపీడీఓలు, తహశీల్దార్లు, ఇంజనీరింగ్ అధికారులతో జగనన్న ఇళ్ల నిర్మాణాలు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, రుణాల మంజూరు, రీసర్వే పట్టాల పంపిణీ, గడప గడపకు మన ప్రభుత్వంలో మంజూరు పనులు, వాలంటీర్ల ఖాళీల భర్తీ వంటి అంశాలపై వీడియో కాన్ఫరెన్స్‌లో మండలాల వారీగా చర్చించారు.జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన లేఅవుట్లకు లెవెలింగ్, అప్రోచ్ రోడ్ల పనులను వేగవంతం చేయాలన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడం, లేఅవుట్లకు పనులు మంజూరై, నిధుల సమస్య లేనప్పటికీ పురోగతిలో ముందుకు వెళ్లడం లేదని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. వరుసగా మూడు వారాలపాటు ఎలాంటి పురోగతి చూపని ఇంజనీరింగ్ అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. గత 7 నెలల నుంచి ఎలాంటి పురోగతి చూపించని ఉయ్యూరు ఏఈ సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. టెండర్లు ఖరారైన లేఅవుట్లలో పనులను వేగవంతం చేయాలని, ఎదురైన సమస్యలను ఇంజనీరింగ్ అధికారులు ఎఫ్ఎస్ఈ పీఆర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి వారం మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు డివిజన్ల ఆర్డీఓలు ఆయా లేఅవుట్లలోని పనులను తనిఖీ చేయాలన్నారు. పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పనిచేయని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలన్నారు. రుణాల మంజూరుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని పీడీ డిఆర్డీఏ, పీడీ మెప్మా అధికారులకు సూచించారు. వచ్చేవారంలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రీసర్వే పట్టాల పంపిణీ ఉంటుందన్నారు. డిఎస్ఆర్, ఆర్వోఆర్ ఫైనల్ డేటాని పునఃపరిశీలన చేయాలని, ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా చూడాలన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రాధాన్యత క్రమంలో మంజూరైన పనులు ప్రారంభానికి అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.డిఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, హౌసింగ్ ఇన్చార్జి పీడీ జివి. సూర్యనారాయణ, సిపిఓ వై. శ్రీలత, ఎస్ఈ పీఆర్ ఈరాస్వామి, డిపిఓ నాగేశ్వరనాయక్, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణరాజు తదితరులు కలెక్టర్ తో పాటు

గన్నవరం డ్రైవింగ్ ట్రాక్‌లో ఆధునిక హంగులు

గన్నవరం : గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు కోసం లక్షలాది రూపాయలతో అత్యాధునిక ట్రాక్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అధునీకరించిన ఆటోమేటెడ్ టెస్ట్ డ్రైవింగ్ సెన్సార్ అమర్చిన పోల్స్ వల్ల డ్రైవింగ్ లైసెన్సుల మంజూరులో అక్రమాలకు చెక్ పడతోంది. డ్రైవింగ్ టెస్టు పారదర్శకంగా నిర్వహించేందుకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. దీనికోసం మానవ ప్రమేయం లేకుండానే డ్రైవింగ్ సామర్థ్య పరీక్షలు నిర్వహించేందుకు ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ పద్ధతి ద్వారా నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా వాహన చోదక యోగ్యత అర్హతను ధృవీకరిస్తుంది. ఈ తరహా ట్రాక్ కొత్తగా విమానాశ్రయం ఎదురుగా ఉన్న రవాణా శాఖ వాహన పటుత్వ పరీక్ష కేంద్రంలో ఏర్పాటు చేశారు. విజయవాడ రవాణా శాఖ కార్యాలయానికి అనుబంధంగా ఉన్న ఈ కేంద్రంలో మోటార్ వెహికల్, లైట్ మోటర్ వెహికల్ డ్రైవింగ్ టెస్ట్ కోసం ప్రతిరోజూ వందలాది మంది వస్తుంటారు. మాన్యువల్ పద్ధతిలో డ్రైవింగ్ లైసెన్సు జారీలో జరిగే అక్రమాలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. మూడు నెలల పాటు చేపట్టిన ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ అధునీకరణ పనులు పూర్తి చేశారు. ఇక్కడ మోటార్ వెహికల్ , లైట్ మోటార్ వెహికలకు సంబంధించి నాలుగు ట్రాక్లు ఉన్నాయి. ఇందులో 8 ట్రాక్, పార్కింగ్, హెచ్ ట్రాక్, గ్రేడియంట్ ట్రాక్‌లు ఉన్నాయి. వీటిని ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ విధానంలో రీమోడలింగ్ చేశారు. దీనికోసం ట్రాక్ చుట్టూ 12 సీసీ కెమెరాలను బిగించారు . ఈ విధానం వల్ల ఖచ్చితమైన డ్రైవింగ్ టెస్ట్ ఫలితాలు రావడంతో పాటు లైసెన్స్ మంజూరులో అక్రమాలు, దళారీ వ్యవస్థ లేకుండా చేయొచ్చు. ఖచ్చితమైన డ్రైవింగ్ టెస్ట్ ఫలితాలు రావడంతో పాటు లైసెన్స్ మంజూరులో అక్రమాలకు పడుతుంది.

అంతా పారదర్శకంగానే : ఆర్.ప్రవీణ్, ఎంవిఐ

ఆటోమేటిక్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌లో అంతా పారదర్శకంగా జరుగుతోంది. డ్రైవింగ్ సామర్థ్య పరీక్షలు ఆటో మేటెడ్‌గా నిర్వహిస్తాం. సెన్సార్ సాయంతో డ్రైవింగ్ పరీక్షలు జరుగుతాయి. డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చే వారు ఆటోమేటెడ్ విధానంపై అవగాహన కలిగి ఉండాలి. రవాణా శాఖ కల్పించిన ఈ సదుపాయాలను ఉపయోగించుకోవాలి.



అనాథలను ఆదుకోవాలి

ప్రజాశక్తి-గన్నవరం

అనాథలను ఆదుకోవడం మానవ ధర్మమని ఏఎంసీ మాజీ డైరెక్టర్ గోపిశెట్టి వీరస్వామి అన్నారు. బుధవారం గన్నవరం మండలం దావాజీగూడెం స్పందన మానసిక వికలాంగుల కేంద్రంలో బాపులపాడు కోపరేటివ్ బ్యాంకు చైర్మన్ యర్రంశెట్టి రామాంజనేయులు పుట్టినరోజు సందర్భంగా వీరాస్వామి ఆధ్వర్యంలో కేకు కట్ చేసి స్వీట్లు పండ్లు, పుస్తకాలు పంపిణీ చేశారు. అన్నదానం జరిపారు. గోపిశెట్టి మాట్లాడుతూ సోదరుడు రామాంజనేయులు మంచి నాయకుడుగా గుర్తింపు పొంది ప్రజలు మన్ననలు పొందాడని తెలిపారు. సేవల్లో కూడా ముందుంటున్నారన్నారు. గన్నవరం ప్రాంతంలో హెల్పింగ్ హాండ్స్ సొసైటీ ఆధ్వర్యంలో అద్భుతమైన సేవలను చేస్తున్న సంస్థ చైర్మన్ సంకాబత్తుల వెంకట్‌కు అభినందనలు తెలిపారు. గన్నవరం నియోజకవర్గం మీడియా సంఘం అధ్యక్షులు కె. కరుణాకర్, హెల్పింగ్ హాండ్స్ సొసైటీ సెక్రటరీ సంకాబత్తుల రజిత వెంకట్, స్పందన మానసిక వికాస కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీచేస్తున్న దాతలు

మండలి బుద్ధప్రసాద్ పరామర్శ

ప్రజాశక్తి-కోడూరు

కోడూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ డిసి వైస్ చైర్మన్ కాగిత రామారావును మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధ ప్రసాద్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు (బుల్లబ్బాయి) పరామర్శించారు. గత కొద్ది రోజుల క్రితం కాగిత రామారావు మాతృమూర్తి కాగిత కామేశ్వరమ్మ (90) మృతితి చెందిన విషయం తెలిసిందే. బుధవారం బుద్ధప్రసాద్, జగన్నాథరావు కాగిత కుటుంబ సభ్యులను పరామర్శించి కామేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. వీరి వెంట కోడూరు ,చల్లపల్లి టిడిపి మండల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మోర్ల రాంబాబు, స్థానిక టిడిపి నాయకులు పాల్గొని నివాళులర్పించారు.



కామేశ్వరమ్మ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మండలి బుద్ధప్రసాద్

జూద క్రీడలు నిర్వహిస్తే చర్యలు : ఎస్ఐ

ప్రజాశక్తి-ఘంటసాల

పేకాట, కోడిపందాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు కొనసాగిస్తే సంబంధిత వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకుంటామని ఘంటసాల ఎస్ఐ కుడిపూడి శ్రీనివాస్ హెచ్చరించారు. ఘంటసాల మండలం చిట్టూర్పు నేతగాని ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్నట్లు మంగళవారం అందిన విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది పేకాట శిబిరం పై మెరుపుదాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేయడంతో పాటు రూ.2,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. ఘంటసాల మండలంలో ఆక్రమ మద్యం, సారా అమ్మిన, పేకాట, కోడి పందాలు, జూదాలు, అసాంఘిక కార్యకలాపాలు పాల్పడిన వ్యక్తుల పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ శ్రీనివాసు తెలిపారు.



చిట్టీల నిర్వాహకుడు హిజ్రా చర్యతో బాలిక ఆత్మహత్య

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ నగరంలో చిట్టీల నిర్వహిస్తున్న హిజ్రాలు వేధింపులకు ఓ బాలిక ఆత్మహత్య చేసుకుంది. పాడుకున్న చిట్టీ సకాలంలో చెల్లించలేదని బాలిక ఇంటి వద్దకు వచ్చి తల్లిదండ్రులపై హిజ్రాలు దౌర్జన్యానికి దిగిన ఘటనకు తీవ్ర ఆందోళన చెందిన ఆ బాలిక ఎవరూ లేని సమయంలో మంగళవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన బుధవారం వెలుగుచూసింది. సత్యనారాయణపురం సిఐ బాలమురళీకృష్ణ కథనం ప్రకారం...విజయవాడ బావాజీపేట 2వ లైన్లో నివాసముంటున్న భార్యాభర్తలు తంబిదాసు, పద్మ ఓ హోటల్లో పని చేస్తుంటారు. వీరికి ఇద్దరు కుమార్తెలు. ఇంటి అవసరాల నిమిత్తం రూ.5 లక్షల చిట్టీలను (రూ.2.5 లక్షల చొప్పున రెండు చిట్టీలు) దంబిదాసు పాడుకొని సకాలంలో చెల్లించడం లేదు. దీంతో చిట్టీ నిర్వహకుడు హిజ్రా అయిన గణేష్ సోమవారం దంబిదాసు ఇంటికెళ్లి గొడవపడ్డాడు. ఆ క్రమంలో దంబిదాసు, హిజ్రా మధ్య వాగ్వాదం జరిగింది. దీనిని గమనించిన దంబిదాసు కుమార్తె అయిన బాలిక ఇంట్లో ఎవరు లేని సమయంలో మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. బాలిక అమ్మమ్మ నరసమ్మ వచ్చి చూసిన తర్వాత ఉరి వేసుకున్న ఘటన వెలుగుచూసింది. ఆత్మహత్య చేసుకున్న బాలిక ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదివి కొంత కాలం ఖాళీగా ఉంది. ప్రస్తుతం డెంటల్ ల్యాబ్ వర్క్ నేర్చుకునేందుకు సిద్ధమవుతోంది. పోలీసులు హిజ్రాను అదుపులోకి తీసుకొని కేసు విచారణ జరపుతున్నట్లు సిఐ బాలమురళీకృష్ణ తెలిపారు.

పిఎన్ఎం సీనియర్ కళాకారుడు రామకృష్ణ మృతి

ప్రజాశక్తి - విజయవాడ రూరల్ : ప్రజానాట్యమండలి (పిఎన్నెమ్) సీనియర్ కళాకారుడు సంకా రామకష్ణ (65) బుధవారం ఆకస్మికంగా మరణించారు. నున్న గ్రామంలోని స్వగహంలో నిర్వహిస్తున్న షాపు సరకులు విజయవాడ నుంచి కొనుగోలు చేసుకొని తిరిగి వస్తుండగా సుబ్బయ్యకుంట ప్రాంతంలో ఒక్కసారిగా కుప్పకూలి మరణించారు. రామకష్ణ చాలా మంచి నటుడు, అత్యంత స్నేహశీలి అని పీఎన్నెమ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జివి రంగారెడ్డి పేర్కొన్నారు. రామకృష్ణ సహాధ్యాయులు గుంటక శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, అజయ్, డి కామేశ్వరరావు, కొర్నిపాటి వేణు (సినిమా), కె రవికుమార్, ఫ్రాన్సిస్, చాగంటి లక్ష్మారెడ్డి, డా.బి శివరాం, సీపీఐ(ఎం) స్థానిక శాఖ కార్యదర్శి జి చిన వెంకటరెడ్డి, సుధా, హనుమాన్, ప్రభాకర్, భీమవరపు సుబ్బారెడ్డి సంతాపం తెలిపారు. గురువారం ఉదయం అంత్యక్రియలు జరుపుతామని కుటుంబ సభ్యులు తెలిపారు.



బీచ్‌లో ముగ్గురు విద్యార్థులను కాపాడిన కానిస్టేబుల్



ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : మచిలీపట్నం మంగినపూడి బీచ్ కు బుధవారం విజయవాడ లోని ఒక ప్రైవేట్ కళాశాల నందు బీటెక్ చదువుతున్న ముగ్గురు విద్యార్థులు స్నానం చేస్తుండగా ఒక్కసారిగా అలల ఉధతికి లోతునకు కొట్టుకుపోయారు. బీచ్ లో విధుల్లో ఉన్న బందరు తాలూకా పోలీస్ స్టేషన్కు చెందిన కానిస్టేబుల్- 556 నాగరాజు కొట్టుకుపోతున్న ముగ్గురిని గమనించి, బీచ్ ఒడ్డున స్థానికంగా ఉన్న జాలర్ల, స్థానికుల సహాయం తీసుకుని, తన ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా తనవద్ద ఉన్న ఒక తాడును తీసుకుని ఒక చివర నడుముకి కట్టుకొని, మరొక చివర ఒడ్డున ఉన్నవారికి పట్టుకోమని ఇచ్చి సముద్రం లోపలికి వెళ్లి కొట్టుకుపోతున్న ముగ్గురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చాడు.అలల తాకిడికి తట్టుకోలేక లోపలికి కొట్టుకుపోతున్న ముగ్గురు యువకులని కానిస్టేబుల్ తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సురక్షితంగా ఒడ్డుకి చేర్చడంతో అక్కడ ఉన్న వారంతా ఊపిరి పిలుచుకున్నారు. ముగ్గురు విద్యార్థులు యొక్క ఆరోగ్యం నిలకడగా ఉండడంతో, వారికి కొద్దిసేపు విశ్రాంతి అందించి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు పంపే ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్న వారిని కాపాడడానికి ప్రాణాన్ని సైతం లెక్కచేయని కానిస్టేబుల్ యొక్క సాహసానికి అక్కడ ఉన్న స్థానికులంతా హర్షధ్వానాలతో అభినందనలు తెలిపారు.

ధాన్యం పూర్తిగా కొనాలి : ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - కంకిపాడు : రాష్ట్ర ప్రభుత్వం ఎకరానికి 26 క్వింటాళ్ల మాత్రమే కొనుగోలు చేస్తామని ప్రకటించింది. సకాలంలో వర్షాలు,వాతావరణం అనుకూలించడం వలన ఈ సంవత్సరం కొంతమేరకు దిగుబడులు పెరిగిన సందర్భంలో రైతులకు మరింత ప్రోత్సాహాన్ని ఇవ్వవలసినది పోయి, రైతులను ఇబ్బందుల పాలు చేయటం సరికాదన్నారు. ఒకపక్క వాయుగుండం ప్రభావంతో దిగాలుగా ఉన్న రైతులపై ఇది



దిగుబడులు పెరిగే అవకాశం ఉన్నది. ఇలాంటి సమయంలో కొనుగోలుపై కోత విధించడం సరికాదని ఏపీ కౌలు రైతు సంఘం కష్ణా జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు అన్నారు. ధాన్యం పూర్తిగా ప్రభుత్వమే కొనాలని కోరుతూ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో కంకిపాడు మండల తాసిల్దార్‌కు అర్జీ ఇచ్చారు. ఈసందర్భంగా రంగారావు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ఎకరాకు 30 క్వింటాల్లు వరకు కొనుగోలు చేసిందని, పిడుగు పాటని ఆయన అన్నారు. జగన్నాథపురంనకు చెందిన కౌలు రైతు వి జాన్ మోజెస్ ఎకరానికి 45 బస్తాలు పండిస్తే, 34 బస్తాలు మాత్రమే కొనుగోలు చేశారని, మిగిలిన 11 బస్తాలు కొనుగులు చేయ బోమని ఆర్‌బికె సిబ్బంది చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం రైతు పండించిన ప్రతి గింజ కొంటామని చెప్పి, ఇలా వ్యవహరించటం సరికాదన్నారు. ఈకార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు జె రవి, రైతు సంఘం మండల కార్యదర్శి వి శివశంకర్, విజాన్ మోజెస్, పి సాంబసివ రావు,డి యేసు, సుందరం పాల్గొన్నారు.

అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయండి

మహిళల రక్షణపై కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ : మహిళలపై జరిగే వేధింపులు, లైంగిక దాడుల నుండి రక్షణ పొందే విధంగా ఇంటర్నల్ కంప్లియెంట్ కమిటీలు ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. కార్యాలయంలో లైంగిక వేధింపుల నివారణ చట్టం 2013 లో భాగంగా జిల్లా స్థాయి కొర్ కమిటీ సమావేశం కలెక్టర్ ఢిల్లీరావు అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో స్త్రీ శిశు సంక్షేమం, పోలీస్, స్వచ్ఛంధ సంస్థలు, సైకాలజిస్ట్, అడ్వకేట్ లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చట్ట ప్రకారం అంతర్గత, స్థానిక ఫిర్యాదుల కమిటీ ఏర్పాటు చేసి మహిళలపై లైంగిక వేధింపులు, హత్యాచారాల నుండి రక్షించాల్సి ఉందన్నారు.

నగ్న చిత్రాలు తీసి యువతులకు వల

- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయవాడ : వస్త్ర దుకాణం నడుపుతూ మాయమాటలు చెప్పి యువతులను వ్యభిచార కూపంలోకి దింపుతున్న మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విజయవాడ సెంట్రల్ ఎసిపి ఖాదర్ బాషా బుధవారం మీడియాతో మాట్లాడుతూ పటమట తోటవారి వీధికి చెందిన పరసా సాయికుమారితో పాటు మస్తాన్, సలీమ్ మరికొందరు ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. మహిళలను ట్రాప్ చేసి, వారికి తెలియకుండా నగ్నచిత్రాలు తీసి, బెదిరిస్తూ డబ్బులు డిమాండ్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ అమ్మాయిని హోటల్‌లో ఏకాంతంగా ఉన్న సమయాన్ని చూసి బెదిరించారు. యువతి ఉన్న వీడియోలు చూపి డబ్బు డిమాండ్ చేశారు. దీంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సాయికుమారి బట్టల దుకాణంలో గతంలో పని చేసిన మహిళను కూడా నిందితులు బెదిరించారు. బట్టల దుకాణలో వస్త్రాలు మార్చుకునే క్రమంలో, పార్టీల పేరుతో తనకు పరిచయమైన కస్టమర్లను సాయికుమారి ఇంటికి పిలిచి వారికి తెలియకుండా నగ్న చిత్రాలు తీసి బెదిరించేది.ఆటోనగర్‌లో ఫౌండ్రీ నడుపుతున్న ఫరూక్ వద్దకు విటులను పంపి అతన్ని మోసగించి గత ఆగస్టులో రెండు లక్షలు డిమాండ్ చేశారు. బాధితుడు 1.90 లక్షలు ఇచ్చినా రూ.పది వేలు ఇవ్వకపోవడంతో బెదిరింపులకు పాల్పడారు. దీంతో బాధితుడితో పాటు ఇద్దరు యువతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారించి ప్రధాన నిందితురాలు సాయికుమారితోపాటు సహకరించిన మరో వ్యక్తిని అరెస్టు చేశారు. పరారీలో ఉన్న ముగ్గురు కోసం గాలిస్తున్నారు. ఈసమావేశంలో పటమట సిఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.



ఏళ్లు గడిచినా దళితుల అభ్యున్నతి శూన్యం

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. ఆపోరాటాల ఫలితంగా జస్టిస్ పున్నయ్య కమిషన్ ఏర్పాటు, 1235 జిఒ జారీ, దళితుల జనాభా ప్రాతిపదికన ఎస్‌సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టం వచ్చాయని తెలిపారు. కళాకారులకు రూ.5 వేల పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేవారు. ప్రభుత్వ పథకాల ప్రచారంలో డప్పు కళాకారులను భాగస్వామ్యం చేయాలని కోరారు. కులాంతర వివాహం చేసుకున్న దళితులకు ప్రభుత్వాలు రూ.10 లక్షలు ఇవ్వాలని, దళితవాడల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, శ్మశాన వాటికలను అభివద్ధి చేయాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో గత 24 ఏళ్లుగా కుల నిర్మూల కోసం కెవిపిఎస్ అనేక పోరాటాలు చేసిందన్నారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, పింఛన్లు పోరాడి సాధించిందని పేర్కొన్నారు. దళితుల్లో సామాజిక చైతన్యాన్ని నింపి గ్రామాల్లో దళితులను ఐక్యంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన 27 రకాల పెన్షన్లను సాధించేందుకు, దళితుల సమస్యలను పరిష్కరించేందుకు



పెనుగంచిప్రోలులో ప్రదర్శన నిర్వహిస్తున్న దృశ్యం

పోరాడాలని అన్నారు. ఈకార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి క్రాంతి కుమార్, కెవిపిఎస్ మండల గౌరవాధ్యక్షుడు దారా నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గురవయ్య పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ కృష్ణకిషోర్ దుర్మరణం

ప్రజాశక్తి-ఉయ్యూరు

విజయవాడ-మచిలీపట్నం రహదారిపై ఆకునూరు వద్ద ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొని డీఎల్డీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మరణించిన సంఘటన బుధవారం జరిగింది. ఉయ్యూరు రూరల్ పోలీసులు వివరాల ప్రకారం ఉయ్యూరు మండల పరిషత్ కార్యాలయంలో డివిజనల్ లెవల్ డెవలప్మెంట్ ఆఫీసర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వై.కృష్ణకిషోర్(51) విజయవాడ అయ్యప్పనగర్‌లో నివసిస్తూ ఉయ్యూరు కార్యాలయానికి వచ్చి వెళ్తుంటారు. ఈక్రమంలో బుధవారం మోటార్ వాహనంపై ఇంటి నుంచి వస్తుండగా ఆకునూరు ఫ్లైఓవర్ సమీపాన రోడ్డుపక్క ఆగిఉన్న టిప్పరును ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించి దర్యాప్తుచేపట్టారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎంపిడీవో విమాదేవి, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కృష్ణకిషోర్ మృతదేహాన్ని సందర్శించారు. మూడు నెలలక్రితం మచిలీపట్నం నుంచి ఉయ్యూరు డిప్యుటేషన్‌పై వచ్చిన కృష్ణకిషోర్ విధి నిర్వహణకు వస్తూ ప్రమాదంలో మరణించటం పట్ల దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. కృష్ణకిషోర్‌కు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దకుమార్తె బీఈటెక్, రెండో కుమార్తె 9వ తరగతి చదువుతోంది. భార్య గుంటూరు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది.

బ్యాటరీల చోరీ నిందితుడి అరెస్టు

ప్రజాశక్తి-చల్లపల్లి

అవనిగడ్డ సబ్ డివిజన్‌లో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ బిపి రవికుమార్ మాట్లాడారు. పగలంతా పాత సామాన్లు కొనేవాడిలా ఆటోలో తిరుగుతూ రాత్రి వేళ పార్కింగ్ చేసిన వాహనాల్లోని బ్యాటరీలు దొంగిలిస్తున్న నిందితుడిని అదుపులకు తీసుకున్నట్లు తెలిపారు. డివిజన్ పరిధిలోని చల్లపల్లి, అవనిగడ్డ, మోపిదేవి, కోడూరు స్టేషన్ల పరిధిలో చోరీలకు కారకుడైన కూచిపూడి శివారు ధర్మవరానికి చెందిన సింహాద్రి బాలచంద్ అలియాస్




చందు, చల్లపల్లి ఎస్ఐ డి.సందీప్ చాకచక్యంగా అరెస్ట్ చేసినట్లు వివరించారు. ఖాళీ ప్రదేశాల్లో నిలిపిన బస్సులు, లారీలు, ట్రాక్టర్ల నుంచి బ్యాటరీలు దొంగిలిస్తున్నారనే సమాచారం మేరకు జిల్లా ఎస్పీ పి.జాషువా ఆదేశాలతో అవనిగడ్డ డీఎస్పీ మహబూబ్ భాషా, చల్లపల్లి సిఐ బి.బి.రవికుమార్ ఆదేశాలతో చల్లపల్లి ఎస్ఐ డి.సందీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ పుటేజీలు పరిశీలించి,అనుమానితులను ప్రశ్నిస్తూ కేసు దర్యాప్తు చేపట్టిన ఎస్ఐ సందీప్ చల్లపల్లి ఎన్టీఆర్ పార్కు సమీపంలో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ ట్రక్కు వాహన డ్రైవర్ పోలీసులను చూసి వెళ్లిపోతుండటం గమనించిన ఎస్ఐ ఆటోను అడ్డుకుని అందులో బ్యాటరీలు ఉండటం గమనించి అతడిని విచారించి వరుస చోరీల గుట్టు రట్టు చేశారు. ట్రక్కు ఆటో అందులోని 19 బ్యాటరీలు స్వాధీనం చేసుకుని చందును అరెస్ట్ చేశారు. మొత్తం నాలుగు స్టేషన్లో 9 కేసులకు సంబంధించి రూ.1.68 లక్షల విలువైన బ్యాటరీలు రికవరీ చేశారు. బ్యాటరీ దొంగతనాలకు అడ్డుకట్ట వేసి నిందితుడిని అరెస్ట్ చేసిన చల్లపల్లి ఎస్ఐ సందీప్, సిబ్బందిని సిఐ రవికుమార్ అభినందించారు. చోరీ కేసును ఛేధించిన స్టేషన్ రైటర్ తిరుమలరావు, కానిస్టేబుళ్లు షేక్ బాజీ, వేణుగోపాలకృష్ణ, ఏడుకొండలును అభినందించి రివార్డులను అందజేశారు.

యువకుడిపై కత్తులతో దాడి

గుడివాడ : స్థానిక ఓవర్ బ్రిడ్జిపై బ్లేడ్ బ్యాచ్ అరాచకాలు సాగిస్తున్నారు. ప్రతి రోజూ రాత్రి సమయంలో ఈ బ్యాచ్ మద్యం, గంజాయి సేవిస్తూ ఒంటరిగా వెళ్తున్న వారిని లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడుతున్నారు. మంగళవారం రాత్రి ఒరిస్సాకు చెందిన గోపాల్‌కుమార్ అనే యువకుడిని కత్తులు చూపించి డబ్బు ఇవ్వాలని కోరగా అతను నిరాకరించడంతో అతనిపై కత్తులతో మెడ, గొంతుపై దాడి చేశారు. కొంత మంది అటుగా వెళ్తే వ్యక్తులు క్షతగాత్రుడిని స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. 2టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జడ్‌పి హైస్కూల్ గ్రౌండ్ అభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీమోహన్

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం జెడ్పీ బాలుర పాఠశాల క్రీడా మైదానాన్ని వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ పరిశీలించారు. రూ.13 లక్షలతో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, దాతలు సాయంతో అభివృద్ధి పనులు, మొక్కలు పెంచటం, వాకింగ్ ట్రాక్ సందర్శించారు. ఏడాది కాలం నుంచి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కలిసి ఏడాదిపాటు ఎంతో కృషి ముళ్ల పొదళ్లు, గుంతల మయం, మందుసీసాలు చెత్తా చెందారం, పందుల సంచారంతో అధ్వానంగా మైదానాన్ని శుభ్రం చేసి అభివద్ధి సుందరంగా తీర్చిదిద్దినట్లు విషయాన్ని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మదుపల్లి బాలకృష్ణమూర్తి, కార్యదర్శి ప్రధాన కార్యదర్శి సిహెచ్ చంద్రశేఖరరావు, కోశాధికారి గంప సాంబశివరావులు ఎమ్మెల్యే వంశీకి దృష్టికి తీసుకొచ్చారు. అతి తక్కువ కాలంలో గ్రౌండ్‌ను అభివృద్ధి చేసిన వాకర్స్ అసోసియేషన్ సభ్యులను ఎమ్మెల్యే వంశీ ప్రశంసించారు. ప్రహరీ గోడ ఎత్తు , గ్రౌండ్ చుట్టూ ఖాళీగా ఉన్న నాలుగు ప్రదేశాల్లో గోడలను నిర్మాణం చేయాలని వాకర్స్ మహిళలు పెద్దలు ఉపయోగించుకొనుటకు మరుగుదొడ్ల నిర్మాణం చిన్న పిల్లలు కోసం పార్కు , ఆట వస్తువులు ఏర్పాటుతో పాటు వాకింగ్ ట్రాక్‌ను ఫైనల్ లేయర్ ఫినిషింగ్ కోసం సహాయాన్ని కోరగా ఎమ్మెల్యే సహృదయంతో అంగీకరించారు. పంచాయతీ రాజ్ ఎఇ దాసు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరిన అంశాలను ఎస్టిమేషన్ వేయించి నివేదిక తనకు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానాన్ని మొక్కవోని దీక్షతో అభివద్ధి సహకరిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే వంశీ తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు టిఎస్ఆర్కే ప్రసాద్, ముక్కామల సుబ్బారావు, గౌరవ అధ్యక్షులు డి.వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శి బ్రహ్మారెడ్డి,జిల్లా వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు కార్యదర్శి కేవిన్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.



లే అవుట్ నమూనాను పరిశీలిస్తున్న పిడి జి.వి.సూర్యనారాయణ

త్వరగా గృహ నిర్మాణాలు పూర్తి : పీడీ ఆదేశం

ప్రజాశక్తి-గుడివాడ

మాల్లాయిపాలెంలో నిర్మాణ పనులను జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.వి. సూర్యనారాయణ పరిశీలించారు. బుధవారం మల్లయ్యపాలెం జగనన్న హౌసింగ్ లే-అవుట్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) చొరవతో గృహ నిర్మాణాలు శరవేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. లబ్ధిదారుల సౌకర్యార్థం లే-అవుట్‌లో ఇంటర్నల్ రోడ్లు, వాటర్, కరెంట్ సప్లై పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇ రామోజీనాయక్, పిఆర్‌డిఇ హరినాథ్‌బాబు, హౌసింగ్ ఏఇ సుబ్బారావు, పిఆర్ ఏఇ రామ్మోహనావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత : వంశీ

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం పంచాయతీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీ తెలిపారు. బుధవారం గన్నవరం రాయనగర్‌లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డుకు స్థానిక మహిళలతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. మర్లపాలెంలో రెండు చోట్ల రూ.20 లక్షలతో నిర్మించి సిమెంట్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ గన్నవరంలో సిమెంట్ రోడ్లతో పాటు పక్కా డ్రైనేజీ నిర్మాణం చేయడానికి సుమారు రూ.10 కోట్లు అవసరమవుతుందన్నారు. సిఎం జగన్‌తో మాట్లాడి నిధుల మంజూరుకు కృషి చేస్తానని వివరించారు. అభివృద్ధిలో దాతల సహకారం కూడా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ ఎ. ఎలిజిబెత్ రాణి, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్, వైసీపీ నాయకులు కాసర్నేని రంగబాబు, గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ మన్నే సుందరరావు, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఎండి గౌసాని, మండల స్థాయి, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

10వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-గన్నవరం

గన్నవరం కోనాయి చెరువు వద్ద ఉన్న శ్రీ కాశీ విశాలాక్షి అన్నపూర్ణ సహిత (శివాలయం)లో కార్తీక మాసం ముగింపు సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో 10వేల మందికి అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ నిర్వాహకులు అందరూ సమిష్టి కృషితో ఈ కార్యక్రమాన్ని విజయంగా ముగించారు. గన్నవరం,బి బి. గూడెం, పురుషోత్తపట్నం గ్రామాల నుంచి కూడా యాత్రికులు వచ్చి అన్న తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆలయ నిర్వాహకులు ఎక్కడా ఇబ్బంది కలగకుండా భారీ ఎత్తున ఏర్పాట్లు చేశారు.

రైతులకు పరిహారం ఇవ్వాలని జనసేన దీక్ష

ప్రజాశక్తి-కోడూరు

రాబోయే రెండు వారాల్లో బాధిత రైతాంగానికి నష్టపరిహారం ఇవ్వకపోతే నిరవధిక నిరాహార దీక్షకు కూర్చుంటామని జనసేన పార్టీ నేతలు హెచ్చరించారు. తీర ప్రాంతం రైతాంగాన్ని ఆదుకుని నష్టపరిహారం చెల్లించాలని కోరుతూ జనసేన పార్టీ నేతలు మండుటెండను సైతం లెక్కచేయకుండా నిరాహార దీక్షకు పూనుకున్నారు. పోలీసుల ఆంక్షలు నడుమ రైతాంగాని మద్దతుగా జనసేన పార్టీ నేతలు



ధర్నాలో పాల్గొన్న జనసేన నాయకులు

కోడూరులో ఒకరోజు నిరాహార దీక్ష ప్రారంభించారు. కోడూరు మండల పరిధిలోని రామకృష్ణాపురం, హంసలదీవి, బసవానిపాలెం, దింటిమేరక తదితర గ్రామాల్లో పంటలు లేక రైతాంగం అనేక ఇక్కట్లు పడుతూ ఉన్నప్పటికీ వారి సమస్యలను పరిష్కారం కావటం లేదన్నారు. వరి సాగులేకపోవటంతో అప్పులు పెరిగిపోతున్నాయనీ, ఇళ్లల్లో ఉన్న బంగారం, పొలాలు కూడా అమ్ముకునే పరిస్థితి నెలకొందన్నారు. ఈ దీక్షలో జనసేన జిల్లా, అవనిగడ్డ నియోజకవర్గ నేతలు, వివిధ మండలాల అధ్యక్షులు, కోడూరు మండల జనసేన పార్టీ నేతలు, కార్యవర్గ సభ్యులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు, జనసైనికులు, రైతాంగం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కోడూరు, నాగాయలంక

కోడూరు మండలం నరసింహపురం గ్రామానికి చెందిన దొవారి అవంతికి అతి చిన్న వయస్సులోనే కిడ్నీలు పాడయ్యాయి. చికిత్సకు ఆర్థిక స్తోమత లేక ఆర్థిక సాయం కోసం



ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న జనసేన నాయకులు

సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. బుధవారం దొవారి అవంతి ఇంటికి వెళ్లి రూ.22,600 ఆర్థిక సహాయాన్ని జనసేన నాయకులు అందజేశారు. కోడూరు మండలంలో గతంలో పోటు మీద గ్రామంలో సీతమ్మ ఇంటి నిర్మాణం నిమిత్తం, గ్యాస్ బండ పేలిన ప్రమాదంలో కళ్ళు, కాళ్లు కోల్పోయిన నరేష్ వైద్య నిమిత్తం వీరు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, కోడూరు మండల అధ్యక్షులు మర్రే గంగయ్య, నాగాయలంక మండల అధ్యక్షులు చింతా వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండల అధ్యక్షులు గుడివాక శేషబాబు, సీనియర్ నాయకులు బండ్రెడ్డి మల్లికార్జునరావు, ఉల్లి శేషగిరిరావు,జిల్లా కార్యదర్శి కొండవీటి సునీత, సంయుక్త కార్యదర్శి ఉస్మాన్ షరీఫ్, నాగాయలంక మండల ఉపాధ్యక్షులు బోనం పాపారావు, బొద్దు విజయ యాదవ్, తోట కొండలరావు, బావిశెట్టి ప్రభాకర్‌రావు, అవనిగడ్డ నియోజకవర్గ ఐటీ కన్వీనర్ సోదాని నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

శిశువు మరణంపై సమగ్ర విచారణ

• ఐద్వా, డివైఎఫ్ఐ డిమాండ్ • పాత ప్రభుత్వాస్పత్రి వద్ద ధర్నా

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక పాత గవర్నమెంట్ ఆసుపత్రిలో మంగళవారం శిశువు మరణించిన ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని ఐద్వా, డివైఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. బుధవారం ఆయా సంఘాల నగర కమిటీల ఈఆధ్వర్యంలో పాత ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి కె.శ్రీదేవి మాట్లాడుతూ సమయానికి వైద్యులు అందుబాటులో లేక, నిర్లక్ష్యం కారణంగా శిశువు మృతిచెందిందని బాధిత తల్లిదండ్రులు చెబుతున్నారని, దీనిని బట్టి వైద్యశాల నిర్వహణ, వైద్యుల పని తీరు ఎలా ఉందో అర్థమవుతుందని అన్నారు. ఇటువంటి ఘటనలు ప్రభుత్వ వైద్యశాలలో ఇటీవల తరుచూ చోటు చేసుకుంటుంటే ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఆసుపత్రిలో అరకొర సౌకర్యాలతో గర్భిణులు, బాలింతలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకే బెడ్‌పై ఇద్దరు, ముగ్గురు బాలింతలను ఉంచడం అత్యంత దారుణమన్నారు. కొంతమందినైతే ఏకంగా నేలపై పడుకోబెడుతున్నారని అన్నారు. వైద్యశాలలో ఎక్స్‌రే, స్కానింగ్‌ల వద్ద గర్భిణులు నిలబడలేక నీరశించి కళ్లు తిరిగి పడిపోయిన ఘటనలు అనేకం జరుగుతున్నాయన్నారు.



పాత ప్రభుత్వాసుపత్రి వద్ద ధర్నా చేస్తున్న ఐద్వా, డివైఎఫ్ఐ నేతలు

కనీసం బల్లలు, ఫ్యాన్లు కూడా లేవన్నారు. పారిశుధ్యం అధ్వానంగా ఉందని, దోమలు, ఈగలు, విషకీటకాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇక్కడున్న వాతావరణానికి అరోగ్యవంతులు కూడా రోగాల బారిన పడుతున్నారన్నారు. సరైన మందులు కూడా అందుబాటులో లేవన్నారు. నిర్మాణ దశలోనే ఆగిపోయిన వైద్యశాలకు నిధులు కేటాయించి, దానిని సత్వరమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా సెంట్రల్ సిటీ కార్యదర్శి జి ఝాన్సీ, డివైఎఫ్ఐ సెంట్రల్ సిటీ కార్యదర్శి ఎస్‌కె నిజాముద్దీన్, నాయకులు శివ, స్వప్న, ఆష, వెంకటరత్నం, అమ్ములు, పిచ్చమ్మ, అరుణ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



రైతు బజార్లను పూర్తి చేయాలి : జెసి

ప్రజాశక్తి-విజయవాడ: నగరంలో నూతనంగా నిర్మిస్తున్న రైతుబజార్ల పనులను త్వరగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ అధికారులను ఆదేశించారు. నగరపాల సంస్థ పరిధిలో సాంబమూర్తి రోడ్డు, జివిస్‌రాజు రోడ్డు, కృష్ణలంక రైతుబజార్ల పనులను బుధవారం జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్ మార్కెటింగ్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ సాంబమూర్తి రోడ్డులోని రైతుబజారు పనులను పరిశీలించి పనులు పెండింగ్‌లో ఉన్నందున కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేసి వేరే కాంట్రాక్టరుకు పనులు అప్పగించాలని అన్నారు. జివిస్ రాజు రోడ్డులోని రైతుబజార్ పనులలో భాగంగా ఆర్వో ప్లాంట్, ప్రహరి గోడ పనులు పూర్తి చేసి ప్లాస్టింగ్, షాపు నెంబర్లు వేయాలన్నారు. కృష్ణలంక రైతు బజారులో గత మూడు నెలలుగా కాంట్రాక్టర్ టాయిలెట్ల నిర్మాణ పనులలో నిర్లక్ష్యం వహిస్తున్నందున కాంట్రాక్టర్‌కు నోటీస్ జారీ చేసి వేరే కాంట్రాక్టరుకు పనులు అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడి ఎ.కిశోర్, డిఇ విఎస్ఆర్‌కె ప్రసాద్ పాల్గొన్నారు. గాంధీనగర్ 192, 193 సచివాలయలను జెసి తనిఖీ చేసి హాజరు పట్టీ, మూమెంట్ రిజిష్టర్లను పరిశీలించారు. సచివాలయ పరిధిలో నమోదయ్యే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఉద్యోగులు అందుబాటులో ఉండి సచివాలయానికి వచ్చే ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్దిదారులకు చేరే విధంగా సేవలందించాలన్నారు. సచివాలయ పరిధిలో అర్హులు, అనర్హుల జాబితా ప్రదర్శించాలన్నారు.

కొమ్మినేనికి వెలంపల్లి శుభాకాంక్షలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రెస్ అకాడమీ ఛైర్మన్‌గా కొమ్మినేని శ్రీనివాసరావు నియమితులైన సందర్భంగా బుధవారం కొమ్మినేని శ్రీనివాసరావును కలిసి మాజీ మంత్రి, విజయవాడ పశ్చిమ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు అమ్మవారి చిత్రపటం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, పలువురు అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యలపై సిపిఎం వినతి

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గం 50వ డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఏపిఎస్‌పిడిసిఎల్ డిఇ సుధాకర్‌కి బోయి సత్యబాబు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని జోడు బొమ్మలు వీధిలో ఇళ్ళ మధ్య ఉన్న విద్యుత్తు లైను మార్పు చేయాలని, రామాలయం గుడి వద్ద అరుణ కాన్వెంట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు చుట్టూ ఫెన్సింగ్ వేసి ఎత్తు పెంచాలని కోరారు. అలాగే క్వారీ కొండపైన ప్రమాదకరంగా వున్న విద్యుత్ స్తంభాన్ని మార్చాలని డిఇకి ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.రాజు, నాయకులు పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు కలెక్టర్ తనయుడు జివితేష్ ఎంపిక



ప్రజాశక్తి-విజయవాడ

జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డిల్లీరావు తనయుడు జివితేష్ రాష్ట్రం నుంచి ఎంపికయ్యారు. విజయవాడ నగరంలోని నలంద విద్యానికేతన్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న జివితేష్ ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు ఎంపికయినట్లు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ మెహబూబ్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే ఏడాది జనవరి 22న జాతీయ స్థాయి చేతిరాత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు రాష్ట్రం నుండి జివితేష్ ఎంపికయ్యారు. గతంలో రాష్ట్ర స్థాయి చేతిరాత పోటీలలో మొదటి స్థానాన్ని సంపాదించిన జివితేష్ ఈ సారి జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననున్నాడు. విజయవాడ నగరంలోని నలంద విద్యానికేతన్‌లో ఎనిమిదవ తరగతి చదువుతున్న జివితేష్ ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలకు ఎంపికైనట్లు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్ అసోసియేషన్ కార్యదర్శి షేక్ మెహబూబ్ హుస్సేన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులలో నైపుణ్యాన్ని, సృజనాత్మకతను పెంపొందించేందుకు హ్యాండ్ రైటింగ్ ట్రైనర్స్, అమ్మఒడి హ్యాండ్ రైటింగ్ అకాడమీ ఆలిండియా గ్రాఫాలజిస్ట్ సంస్థ ప్రతి మూడేళ్లకు ఒకసారి ఒలింపియాడ్ జాతీయ స్థాయి కాలిగ్రఫీ పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మూడో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు మాత్రమే ఈ పోటీలలో పాల్గొనే అవకాశం ఉందని, రాష్ట్రస్థాయిలో 14 వేల మంది హాజరవ్వగా జివితేష్ ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ పోటీలు దేశవ్యాప్తంగా అన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా జరుగుతాయని, రాష్ట్ర నుంచి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎక్కువగా పాల్గొంటున్నారని తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 3 లక్షల మందిపైగా పాల్గొనే అవకాశం ఉందని జాతీయస్థాయి కాలిగ్రఫీ చేతిరాత నిపుణులు భువనచంద్ర తెలిపారు.



స్టెల్లాలో ఉత్సాహంగా తెలుగమ్మాయి షో

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: బెంజిసర్కిల్ వద్ద గల మేరిస్ స్టెల్లా కళాశాలలో తెలుగమ్మాయి షో ఉత్సాహభరితంగా బుధవారం కళాశాల ఆడిటోరియంలో జరిగింది. కళాశాలకు చెందిన ఇంటర్, డిగ్రీ విద్యార్థినులు చక్కగా సంప్రదాయ పద్ధతిలో లంగా.. ఓణీ ధరించి ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినులు సంప్రదాయబద్ధంగా ర్యాంప్ వాక్ చేయడంతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలను తెలియచేసే విధంగా వస్త్రాలను అలంకరించుకున్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా ఉషాకుమారి, డాక్టర్ మంగా, డాక్టర్ జోసెఫ్ వ్యవహరించగా కళాశాల లెక్చరర్ స్వప్న కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

నేడు కబేళాలో విద్యుత్ నిలిపివేత

ప్రజాశక్తి-భవానీపురం: కబేళా విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కెవి లలితానగర్ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా 24వ తేదీ గురువారం ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు జోజినగర్, లలితా నగర్, పోలీస్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, నేతాజీ స్కూల్ రోడ్డు, నూరి మసీద్ రోడ్డు, రైతు బజార్ రోడ్డు, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందని ఎపిసిపిడిసిఎల్ కార్యనిర్వాహక ఇంజనీర్, విజయవాడ టౌన్ బి.వి.సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

చిట్టినగర్‌లో మొబైల్ అన్న క్యాంటీన్

ప్రజాశక్తి-వన్‌టౌన్: 48వ డివిజన్ చిట్టినగర్ సెంటర్‌లో మొబైల్ అన్న క్యాంటిన్ ద్వారా పేదలకు భోజన సదుపాయం కల్పించినట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్ధా వెంకన్న తెలిపారు. కేశినేని ఫౌండేషన్ ట్రస్టీ కేశినేని శివనాథ్ ఆధ్వర్యంలో బుధవారం అన్న క్యాంటిన్‌ను చిట్టినగర్ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాంద్రేగుల రవీంద్ర, 48వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ, సాదరబోయిన ఏడుకొండలు,



గణప రాము, నాగోతి రామారావు, లోకేష్, పిళ్లా అచ్యుతరావు, పేరాబత్తుల వీరకుమార్, రాజగిరి అశోక్ పాల్గొన్నారు.